# నీల్‌బాగ్ డేవిడ్

ఎస్.ఆనందలక్ష్మి
రోజాలిండ్ విల్సన్
అనువాదం: టి.నరసింహులు

జన విజ్ఞాన వేదిక
మంచి పుస్తకం



శ్రీ యస్.కె.నరసింహారావు, ఐ.ఏ.ఎస్.
రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్
జిల్లా ప్రాథమిక విద్యా పథకం

## ఓ మాట...

నేర్చుకోవడం జీవితం నుంచి వేరైన నాటి నుంచి 'చదువు' మొదలయ్యింది. ఈ చదువు ఉన్న వారికీ, లేనివారికీ మధ్య వివక్షత చూపుతూ ఉన్న వారిని అందలం ఎక్కిస్తూనే, ఇంకోవైపు చింతబెత్తాం, బట్టీ పట్టడం, మూసపోత మూక ఆలోచన విధానాన్ని ప్రోత్సహిస్తూ వస్తోంది. చదువును ఆసక్తికరంగా, సృజనాత్మకంగా, ఆనంద దాయకంగా, జీవితంతో సంబంధం గలదిగా మలచటానికి సమాంతరంగా అనేక ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ విషయంలో మన దేశంలో ఠాగూర్, గాంధీ, గిజుభాయి ఆలోచనలు ఎందరికో ప్రేరణగా నిలిచాయి. ఇటువంటి తత్వవేత్తలు, విద్యావేత్తల గురించి, చదువులలో ప్రయోగాల గురించి ఆరు పుస్తకాలను కూర్చి 'చదువులు - కొత్తదారులు' పేరుతో జనవిజ్ఞాన వేదిక, మంచి పుస్తకం కలిసి ప్రచురించటం సంతోషం. అన్ని వేళలా, అన్ని సందర్భాలలో పిల్లల పక్షాన ఉండటమే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చేయవలసిన పని అని ఈ పుస్తకాలు చెబుతాయి. ఇంకెందరో విద్యావేత్తలూ, వారి ప్రయోగాలూ ఇందులో చోటు చేసుకోకపోయినప్పటికీ ఈ ప్రయత్నం చదువుతో ముడిపడిన వారందరికీ - విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లల బాగుకోరే వారందరికీ ఉపయోగకరంగా ఉంటుందనీ, ఆలోచనలకు ఊతమవుతుందనీ ఆశిస్తూ...

(యస్.కె.నరసింహారావు)

హైదరాబాదు
సెప్టెంబరు, 2002

చదువులు - కొత్తదారులు-3
నీల్‌బాగ్ డేవిడ్: ఎస్.ఆనందలక్ష్మి, రోజాలిండ్ విల్సన్
**హిందీమూలం:** నీల్‌బాగ్‌కే డేవిడ్ (సంపాదకత్వం అరవింద గుప్తా)
**అనువాదం:** టి.నరసింహులు
**బొమ్మలు:** అవినాష్ దేశ్‌పాండే, ఎలీనా వాట్స్
**హిందీలో ఈ పుస్తకమాల సంపాదకులు:** అరవిందగుప్తా
**తెలుగులో ఈ పుస్తకమాల సంపాదకులు:** కె.సురేష్
© భారత జ్ఞాన విజ్ఞాన సమితి

**కంపోజింగ్:** ఆర్.జె. గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్-500 020.
ఫోన్: 661 0373

**ముద్రణ:** చరిత గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్-020.
ఫోన్: 760 7361

**వెల:** రూ. 9.00
**ప్రచురణ కాలం:** సెప్టెంబరు, 2002

**ప్రచురణ, ప్రతులకు:**
**జన విజ్ఞాన వేదిక**
జి.మల్యాద్రి, కన్వీనర్ ప్రచురణల విభాగం
162, విజయలక్ష్మినగర్
కొత్తూరు పోస్ట్, నెల్లూరు - 524 004.
ఫోన్: 0861-305303

**మంచి పుస్తకం**
'వాసన్', 12-13-452, వీధి నెం.1
తార్నాక, సికింద్రాబాద్ - 500 017.

జాతీయ సాక్షరతా మిషన్ సహాయంతో భారత జ్ఞానవిజ్ఞాన సమితి, న్యూఢిల్లీ ప్రజల చదువుల ఉద్యమం (జనవాచన్ ఆందోళన్) పేరుతో బాలల పుస్తకమాలగా దాదాపు 60 పుస్తకాలు ప్రచురించింది. గ్రామీణ ప్రజలు, పిల్లల్లో చదవటంపట్ల ఆసక్తి కలిగించటం ఈ పుస్తకాల ఉద్దేశం. వాటిల్లోనుంచి చదువులు, విద్యావేత్తలు, కొన్ని ప్రయోగాత్మక బడుల గురించిన ఆరు పుస్తకాలను ఎంపికచేసి 'చదువులు - కొత్తదారులు' పేరుతో ప్రచురిస్తున్నాం. ఈ ఆరు పుస్తకాలు ప్రత్యేకించి 'చదువు'కి సంబంధించి ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, తత్వవేత్తలు, కార్యకర్తలు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రచురిస్తున్నాం.



# పిల్లల పూదోట - నీల్‌బాగ్

పిల్లలకు స్కూళ్ళు జైళ్ళ లాంటివి. నిజం చెప్పాలంటే పిల్లలు బడికి వెళ్ళ డానికి బొత్తిగా ఇష్టపడరు. కాని తల్లిదండ్రులు వారిని బడులలోకి బలవంతంగా నెడుతూ ఉంటారు. బడికి వెళ్ళడం లేదా మానేయడం అన్న నిర్ణయం పిల్లల చేతుల్లోలేదు. ప్రభుత్వం నేడు పల్లె-పల్లెలో బడులు ప్రారంభిస్తోంది. కాని ఈ బోర్ కొట్టించే బడులకు వెళ్ళడం కన్నా బయట ప్రపంచంలోనే పిల్లలు ఎక్కువగా మజా చేస్తుంటారు.

గడచిన 20 సంవత్సరాలలో నాకు 1200కు పైగా బడులను చూసే అవకాశం దొరికింది. వాటిల్లో నీల్‌బాగ్ చాలా అరుదైనది. దాని జ్ఞాపకాలనే సువాసనలు ఇంకా నన్ను అంటి పెట్టుకొని ఉన్నాయి. వేరువేరు పనులపై మూడు సార్లు ఈ బడిని నేను చూశాను. నామదిలో నేటికీ ఆ జ్ఞాపకాలు తాజాగా ఉన్నాయి.

నీల్‌బాగ్ పల్లె పిల్లల కోసం ఉద్దేశించినది. బహుశా ప్రపంచంలోకెల్లా తమబడి చాలా ఆసక్తికరమైన ప్రదేశం అయినందువల్ల పిల్లలు ఇక్కడకు ఆనందంగా వస్తూ ఉంటారు. బడి మొదలు కావడానికి గంటముందే పిల్లలు వచ్చి తమ స్థానాల్లో కూర్చుని ఉంటారు. పిల్లలు తమ గ్రామాలలోనే ఉండాలని డేవిడ్ కోరిక. బహుశా అందుకేనేమో ఆయన పిల్లల కోసం నీల్‌బాగ్‌లో హాస్టలు

తెరవలేదు. హాస్టలులో ఉన్నట్లయితే పిల్లలు పల్లెకు దూరమయ్యే అవకాశం ఉంది. సాయంత్రం బడి అయిన తర్వాత కూడా పిల్లలు ఇంటికెళ్ళేవారుకాదు. వాళ్ళు బడిలోనే ఉండేవారు. చాలా రాత్రయిన తర్వాత డేవిడ్ వాళ్ళను ప్రేమగా – "పగలంతా నా మెదడు తినేశారు. కనీసం ఇప్పుడైనా ప్రశాంతంగా ఉండ నివ్వండిరా బడుద్ధాయిల్లారా" అని మందలించేవారు. ఆ తర్వాత డేవిడ్ పైడ్–పైపర్ లా పాటపాడుతూ ఆ చీకటిలోనే పిల్లలను గ్రామం వరకు తీసుకెళ్ళి విడిచి వచ్చేవాడు.

నీల్‌బాగ్ బడి ఒక పొడవాటి గదిలో నడుస్తుండేది. గదిలోని ఓ గోడకు రాళ్ళతో చేసిన తలుపులేని అలమరా ఉంది. అలమర అరలలో రకరకాల పుస్తకాలు, ఇతర శిక్షణ సామగ్రి ఉన్నాయి. దీనిలో చాలా వరకు పిల్లలు, అధ్యాపకులు తయారు చేసినవే. ఒకటి నుండి 10వ తరగతి వరకు పిల్లలు ఒకే చోట చదువుకుంటూ ఉండేవారు. తరగతిలో ఎటువంటి ఉపన్యాసం (లెక్చర్) ఉండేది కాదు. తమ స్థాయికి తగిన భిన్న–భిన్న విషయాలకు సంబంధించిన పుస్తకాలను పిల్లలు ఎంపిక చేసుకుని వాటిని తమకు నచ్చిన రీతిలో చదువుతూ ఉండేవారు. ఏదైనా పుస్తకం చదవడం పూర్తయిన తర్వాత అదే విషయానికి సంబంధించిన ఇంకో పుస్తకం అరనుండి తీసుకుని పని మొదలు పెడతారు. ఏదైనా కుటుంబంలో పెద్ద పిల్లలు తమ తమ్ముళ్ళు, చెల్లెళ్ళకు ఏవిధంగా నేర్పిస్తారో బడిలో కూడా అదేవిధంగా ఉంటుంది. ఒక వేళ ఎవరైనా పిల్లవాళ్ళకు అర్థం కానపుడు వారు తమ కంటే పెద్దపిల్లల నుంచి ఆ విషయం గురించి తెలుసుకుంటారు. వాస్తవానికి తరగతిలో పిల్లలకు సహాయం చేయడం కోసం ఎవరో ఒక అధ్యాపకుడు ఉండే ఉంటాడు. తమకు నచ్చిన రీతిలో చదువుకునే స్వేచ్ఛ పిల్లలకు ఉంది. ఇక్కడ ఏదైనా పిల్లవాడికి ఒక సమయంలో మూడవ తరగతి తెలుగు, ఎనిమిదవ తరగతి గణితం, ఆరవ తరగతి ఇంగ్లీషు చదివేందుకు వీలుండేది.

నీల్‌బాగ్ ఒక విలక్షణమైన బడి. ఇక్కడ గ్రామీణ ప్రాంత పిల్లలకు కన్నడ, తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు భాషలు తెలుసు. ప్రపంచంలోని 10 భాషలకు చెందిన 150 పాటలు ఈ బడి పిల్లలు పాడగలరు. వీరి అభివ్యక్తి, ఆత్మవిశ్వాసం రెండూ చూడతగ్గవే. ఎపుడైనా, ఎవరైనా అతిథి నీల్‌బాగ్ సందర్శించినప్పుడు పిల్లలు వారిని పాటలు పాడమని అభ్యర్థిస్తారు. కనీసం రెండు పాటలైనా పాడకుండా అతిథులను వారు అక్కడనుంచి వెళ్ళనివ్వరు. ఈ పిల్లల్లో



ఎంతోమంది తరువాత డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంత పిల్లలకు ప్రపంచస్థాయి విద్యను అందించే క్రమంలో నీల్‌బాగ్ ప్రయత్నం అద్భుతమైనది. గ్రామీణ పిల్లల్లో కూడా అద్భుతమైన ప్రతిభ ఉందనే విషయం ఈ ప్రయోగం చాలా స్పష్టంగా నిరూపిస్తుంది. సరైన అవకాశం, పరిస్థితులు అందుబాటులోకి తీసుకువస్తే విద్యలో ప్రపంచంలో ఎవరికీ వాళ్ళు తీసిపోరు.

నీల్‌బాగ్ బడిని డేవిడ్ ప్రారంభించారు. 1984 సంవత్సరంలో ఆయన చనిపోయిన తరువాత బహుశా నీల్‌బాగ్ ఆత్మ కూడా అంతరించిపోయిందనిపిస్తుంది. డేవిడ్ తరువాత ఆయన కొడుకు నికోలస్, భార్య డోరిన్ రెండు మూడేళ్ళు నీల్‌బాగ్‌ను ఆపారు. కాని చివరకు వాళ్ళు ఈ బడిని కృష్ణమూర్తి ఫౌండేషన్‌కు ఏడులక్షల రూపాయలకు అమ్మి తిరిగి ఇంగ్లండు వెళ్ళిపోయారు. కృష్ణమూర్తి ఫౌండేషన్‌వారు నీల్‌బాగ్ వైభవాన్ని పునరుద్ధరించడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ వారు విజయం సాధించలేకపోయారు. వారు డేవిడ్‌కు ఎటువంటి ప్రత్యామ్నాయం కనుక్కోలేకపోయారు. డేవిడ్ వ్యక్తిగత పుస్తక సంకలనం చాలా అద్భుతమైనది. ప్రపంచానికి సంబంధించిన అన్నివిషయాలపై దాదాపు 7000 వరకు ఎంపిక చేసిన పుస్తకాలు ఆయన దగ్గర ఉండేవి.

డేవిడ్ తనకు నచ్చిన విధంగానే జీవితం గడిపాడు. ఆయన ఒక అద్భుత ప్రతిభా సంపన్నుడు. డేవిడ్ తన చిరకాల స్వప్నమైన నీల్‌బాగ్‌ను నడపగలగడానికి కారణం బహుశా డబ్బుకోసం ఆయన ఎవరినీ యాచించకపోవడమే. డేవిడ్, నికోలస్‌లు కలసి రాసిన వందకుపైగా పుస్తకాలలో చాలా వాటిని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, ఓరియంట్ లాంగ్‌మాన్ లాంటి సంస్థలు ప్రచురించాయి. ప్రతి సంవత్సరం ఈ పుస్తకాలపై వారికి భారీ రాయల్టీ లభిస్తుండేది. ఈ రాయల్టీతో బడి ఖర్చులు చాలా వరకు జరిగేవి. ఈనాటికీ నీల్‌బాగ్ ట్రస్ట్‌కు వస్తున్న రాయల్టీతో ఎన్నో బడులకు సహాయం అందుతోంది.

ఈ మధ్యనే కొన్ని సంవత్సరాల క్రితం కృష్ణమూర్తి ఫౌండేషన్ వారు నీల్‌బాగ్‌ను బెంగుళూర్‌కు చెందిన ఒక సంస్థకు అప్పగించారు. ఈ సంస్థ వికలాంగులకు సంబంధించిన సహాయ కార్యక్రమాలలో పాలుపంచుకుంటోంది.

**-అరవిందగుప్త**



# ఒక మంచి ఉపాధ్యాయుని ప్రయోగాలు

గడచిన దశకంలో బడికి వెళ్ళేవయసున్న పిల్లలందర్నీ బడిలో చేర్చడానికి విస్తృత ప్రచారం జరిగింది. 'అందరికీ చదువు' అనే ప్రభుత్వ నినాదాలను కూడా ఈ ప్రచారంలో భాగంగా వాడుకున్నారు. పిల్లలందరికీ తప్పనిసరిగా అక్షర జ్ఞానం, గణితజ్ఞానం, వృత్తిపరమైన దక్షత అందించాలనే ప్రయత్నానికి పెద్ద ఎత్తున ప్రజా మద్దతు లభించింది. 'అందరికీ విద్య అందుబాటులో ఉండాలి' అనే విషయంలో అందరిదీ ఏకాభిప్రాయమే అయినప్పటికీ దీనిని అమలుపరిచే విధానాలలో చాలామందికి అభిప్రాయ బేధాలున్నాయి.

ప్రస్తుతం ఉన్న అన్ని పాఠ్యక్రమాలు గ్రామీణ విద్యార్థుల దృష్టిలో చాలా వరకు పరిచయంలేని (పరాయి), అసందర్భమైన, ఉపయోగంలేనివనే అభిప్రాయముంది. వాళ్ళు చదివే పుస్తకాలు, లేదా వాళ్ళను ఏదైనా వ్యాసం రాయమన్నప్పుడు వారి జీవితానుభవాలు ఎక్కడా ప్రతిబింబించవు. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామీణ పిల్లలు ప్రాథమికస్థాయి పరీక్ష ఉత్తీర్ణులై మొదటి గండం గట్టెక్కినప్పుడు తమ కుటుంబంనుండి, సమాజం నుండి వేరుపడిపోతారు. చాలామంది అధ్యాపకులు నగర వాసులైనందున గ్రామీణ పిల్లలపట్ల వారిలో ప్రేమ, వాత్సల్యం, ఆదర భావాలుండవు. ఇటువంటి స్థితిలో గ్రామీణ విద్యార్థుల





విద్యా అనుభవాలు ఆనందంగా ఉండే అవకాశాలు చాలా తక్కువ. గ్రామీణ విద్యాలయాల కోసం పాఠ్యక్రమాలు రూపొందిస్తున్నపుడు వారి రోజువారీ జీవితంలో పనికొచ్చే సామెతలను ఉపయోగించాల్సి ఉంటుంది. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉంటూనే మెరుగైన జీవితాన్వేషణకు అవసరమైన యోగ్యతలను వారిలో పెంపొందించాలి.

పిల్లలకు రోజువారీ జీవితంలో అర్థం కాని విషయాలను తెలియజేయడం విద్యయొక్క ప్రాథమిక ఉద్దేశమనే దృక్పథం ఒకటి ఉంది. తక్కువ వసతులు, అవకాశాలున్న గ్రామీణ విద్యార్థిని ముందుకు తీసుకుపోవడంలో సహాయం చేకూర్చేదిగా చదువు ఉండాలి. సౌకర్యాలు ఉన్న, లేని విద్యార్థులకు సమాన అవకాశాన్ని కలిగించేదిగా విద్య ఉండాలని ఈ ఆలోచనను సమర్థించే వాళ్ళ అభిప్రాయం. మంచి విద్య ద్వారానే సమాజంలో వ్యాపించి ఉన్న అసమానతల నుండి ముక్తిని పొందగలం. డేవిడ్ హార్స్‌బరో నడిపిన నీల్‌బాగ్ ఈ ఉద్దేశానికి అంకితమైంది. ఇటువంటి స్థితిలో సెప్టెంబర్ 5 అధ్యాపకదినం సందర్భంగా అనన్యసామాన్యుడైన అధ్యాపకుడు ఈ డేవిడ్ హార్స్‌బరోను స్మరించడం కన్నా గొప్ప విషయమేముంటుంది?

డేవిడ్ హార్స్‌బరో చనిపోయి ఇప్పటికీ 14 సంవత్సరాలు గడిచిపోయాయి. ఆయన పేరు, గొప్పతనాలను మరచిపోవడం అంత సులభంకాదు. ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా ఎవరైనా డేవిడ్‌తో విద్యగురించి కాల్పనిక తర్కం చేయగలరా? అని నాలో నేనే ప్రశ్నించుకుంటుంటాను. కాని ఇది కేవలం మాటల గారడీ మాత్రమే నని నాకు తెలుసు. దీని జవాబు నాదగ్గర ఎప్పటి నుంచో ఉంది.



డేవిడ్ హార్స్‌బరో అత్యుత్సాహం నిండిన పట్టుదల, సృజనాత్మకత, చాతుర్యంగల అద్భుత వ్యక్తి. అధ్యాపన పట్ల విపరీతమైన మోజున్నప్పటికీ ప్రస్తుతం భారతదేశంలో ఉన్న అన్ని విద్యావిధానాలపై ఆయనకు నిరాశ ఎదురయ్యింది. ఈ

నిరాశాపూరిత స్థితే నీల్‌బాగ్ గురించి ఆలోచించ డానికి, దానికి సాకారం చేసే దిశగా ముందడుగు వేయటానికి ఆయనను ప్రోత్సహించింది. ఈ బడికి మూల సిద్ధాంతాన్ని, విశిష్టరూపాన్ని ఇచ్చింది సాటి లేని డేవిడ్ హార్స్‌బరో వ్యక్తిత్వమే.



విభిన్న సందర్భాలను అర్థం చేసుకోడానికి డేవిడ్ జీవిత సంక్షిప్త సమాచారం సహాయపడుతుంది. డేవిడ్ హార్స్‌బరో పుట్టుకతో బ్రిటిష్ జాతీయుడు, వర్ణం ప్రకారం భారతీయుడు మరియు స్వభావరీత్యా ప్రపంచపౌరుడు. 40వ దశకంలో హైస్కూలో చదువు పూర్తిచేసిన తర్వాత, రెండవ ప్రపంచయుద్ధం చివరి దశలో డేవిడ్ రాయల్ వైమానిక దళానికి ఎంపిక అయి భారతదేశం వచ్చాడు. అప్పట్లో ఆయన భారత్‌లో ఇప్పటి బంగ్లాదేశ్ ప్రాంతంలో ఉండేవాడు. భారత గ్రామీణ జీవనం, ప్రజలు, సంగీతంపట్ల ఆయన ప్రేమానురాగాలు ఆగస్టు 1984లో ఆయన చనిపోయేవరకు కొనసాగాయి.


యుద్ధం సమాప్తం అయిన తర్వాత డేవిడ్ లండన్ విశ్వవిద్యాలయంలోని భారతీయ చరిత్ర, సంస్కృతికి సంబంధించిన చదువులో ప్రవేశం పొందాడు. భారతదేశం తిరిగి రావాలన్న తన లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని సంస్కృతం, హిందీ, ఉర్దూ భాషలను నేర్చుకున్నాడు. లండన్ విశ్వవిద్యాలయం నుండి పట్టా పొందిన తర్వాత డేవిడ్ తిరిగి భారతదేశం వచ్చాడు. అధ్యాపకుడు కావాలని ఆయనకున్న ప్రబలమైనకోరిక ఆయన్ను జిడ్డుకృష్ణమూర్తి స్థాపించిన రుషివ్యాలీ స్కూల్ వైపు నెట్టింది. కొన్ని సంవత్సరాలు అక్కడ పనిచేసిన తర్వాత డేవిడ్ నీలగిరి, బ్లూ మౌంటేన్ తదితర బడులకు వెళ్ళాడు. తరువాత మైసూర్ వచ్చి క్షేత్రీయ ఆంగ్ల మహావిద్యాలయాన్ని స్థాపించడమేకాక కొంతకాలంపాటు దాని అత్యున్నత బాధ్యతలను కూడా చేపట్టాడు.

తరువాత ఆయన ఇంగ్లీష్‌ను ద్వితీయ భాషగా బోధించాలనే బ్రిటీష్ కౌన్సిల్ లోని దళంలో చేరాడు. ఈ దళంలో ఈయనకు మద్రాసు కార్పోరేషన్‌లోని ఒక బడిలో పేద పిల్లలకు పుస్తకాలు తయారుచేసే బాధ్యత అప్పగించారు. ఇక్కడ ఆయనకు భారతీయ విద్యార్థుల అవసరాల కనుగుణంగా పుస్తకాలను, కార్య-పుస్తకాల (వర్క్ బుక్స్)ను తయారుచేసే అవకాశం లభించింది. నిరాడంబరత,



చలోక్తులతో కూడిన ఆయన స్వభావం ఈ పుస్తకాల్లోని ప్రతి పేజీలోనూ గమనించవచ్చు. అంతేగాక ఆయన వేసిన బొమ్మల కారణంగానే ఈ పుస్తకాలు పిల్లలందరికీ అత్యంత ప్రీతి-పాత్రమయ్యాయి.

బ్రిటిష్ హై కమీషన్ అంగమైన బ్రిటిష్ కౌన్సిల్‌లో ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించి ఒక నియమముంది. ఈ నియమంలో భాగంగా ఏ వ్యక్తి అయినా ఒకచోట 15 సంవత్సరాలు మాత్రమే ఉండాలి. తరువాత నియామకం కోసం భారత్ వదిలిపెట్టాల్సి వచ్చినప్పుడు డేవిడ్ వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవడమే మేలని భావించాడు. కర్నాటకలోని కోలారు జిల్లాలో ఎనిమిదెకరాల స్థలం తీసుకొని తన చిరకాల స్వప్నమైన నీల్‌బాగ్‌ను సాకారం చేసే ప్రయత్నాలు ప్రారంభించాడు. డేవిడ్ హార్స్‌బరో చేసిన నీల్‌బాగ్ ప్రయోగం కొత్త పంథాలో నడిచే ఆయన జీవిత కథలాంటిదే. స్వతంత్ర భారతంలో గ్రామీణ విద్యార్థులకు ప్రపంచస్థాయి, నాణ్యమైన విద్యను అందించడంలో బహుశా ఇదే మొదటి ప్రయత్నమేమో!



డేవిడ్ ఒక సంపూర్ణ వ్యక్తి. పని, జీవన శైలి, గీతాలు, బోధన మొదలైన అన్ని విషయాలలో ఆయన తత్వం కనిపిస్తుంది. ఈ విషయాలన్నీ ఒక దానికొకటి ముడిపడి ఉన్నాయి. నీల్‌బాగ్ ప్రారంభించిన తర్వాత ఆయన 'ఒకవేళ నేను అలా చేయ గలిగి ఉంటే' అనే ఆలోచనను వదిలిపెట్టాడు. ఇప్పుడు ఏదయితే చేయాలని కోరుకుంటాడో దాన్నే చేయడం మొదలు పెట్టాడు. తన అద్భుత ప్రతిభ ఆధారంగా ఆయన ఎన్నో విషయాలను చాలా గొప్ప రీతిలో చేసి చూపించాడు.

అన్నిటికంటే ముందు మొక్కలు నాటాడు. తరువాత వాటి చుట్టూ స్వయంగా తయారుచేసిన డిజైన్‌తో లారీబేకర్ సలహాలతో గుడిసెలు కట్టాడు. స్వయంగా డేవిడ్ పనితనంగల వడ్రంగి. తరగతుల కోసం గదులు, కార్యశాల డిజైన్ తయారుచేయడమేగాక వాటి నిర్మాణంలో కూడా పాల్గొనేవాడు. మిగిలిన భవనాలను పాఠ్యక్రమంలో భాగంగా కట్టారు. కొద్ది నెలల తరువాత పిల్లలు ఆ ప్రాంతంలో సాంప్రదాయమైన గుండ్రని గదులు కట్టారు.

నీల్‌బాగ్ భావన (concept), అధ్యయనం, అవలోకనం, ఆలోచనలు, శిక్షా

వ్యూహం అన్నీ డేవిడ్ దీర్ఘానుభవాలను వడపోత పోసుకొని రూపుదిద్దుకున్నాయి. నీల్‌బాగ్‌ను సందర్శించే వాళ్ళు తరచుగా మిగతా వాటికంటే బడి ఏవిధంగా భిన్నమైంది? ఈ బడి తత్త్వం ఏమిటి? అలాగే నీల్‌బాగ్ సిద్ధాంతాన్ని ఇతర బడులలో ఇదేరూపంలో అమలు పరచవచ్చా? వంటి ప్రశ్నలు అడుగుతూ ఉంటారు. వీటికి డేవిడ్ స్వయంగా ఉత్సాహం, ఛలోక్తులతో సమాధానమిస్తూ ఉండేవాడు.


1980వ సంవత్సరంలో ఒక పనిదినం. నేను ఉదయం 9 గంటలకు నీల్‌బాగ్ చేరుకున్నాను. రెల్లుగడ్డి కప్పిన ఒక గుడిసె (ఇందులో 3 నుండి 18 సంవత్సరాల వయస్సుగల 25 మంది విద్యార్థులు ఒకేసారి కూర్చోవచ్చు)లో ఒక స్వచ్ఛమైన వాతావరణంలో చాలా మధురమైన స్వరంలో కొంతమంది పాడుతూ ఉన్నారు. ముందు డేవిడ్ పాడుతూ ఉండగా ముగ్గురు అధ్యాపకులు ఆయనను అనుసరిస్తున్నారు. ఈ పాటల్లో అదరగొట్టే ఒక వైవిధ్యముంది. గుజరాతీ భజనలు, అస్సామీ నావికుల గీతాలు, కేరళ మత్స్యకారుల సంగీతం,



ఇంగ్లీష్ ప్రేమ గీతాలు, ఫ్రెంచ్, జర్మన్ జానపద గేయాలతోపాటు తెలుగు భక్తి సంగీతం లాంటివి అన్నీ ఒకేలా ప్రభావితమై ఉన్నాయి. ఇక్కడ మిగిలిన బడులలో మాదిరి ఏ ఒక్క పిల్లవాడు తన ఒక్కడి గొంతే పెద్దగా వినిపించే ప్రయత్నం చేయటం లేదు. ప్రతి ఒక్కరూ ఒకే లయ, ఒకే స్వరంతో ఇతరుల స్వరంలో కలిసిపోయి పాడుతున్నారు.

ఇక్కడ ప్రతిరోజూ ఉదయం ఒక గంట సంగీతం ఉంటుంది. ఇందులో అందరు పిల్లలు ఒకేచోట ఉంటారు. దీనివల్ల అందరికీ ఒకరితో ఒకరు స్నేహంగా మెలగడానికి అవకాశం లభిస్తుంది. ఎవరైనా పిల్లవాడు స్పష్టంగా పాడడానికి ముందు స్పష్టంగా వినడం నేర్చించాలనేది డేవిడ్ అభిప్రాయం. ప్రశాంతత గొప్పతనం తెలుసుకోవడం ద్వారానే ఎవరైనా ధ్వని గొప్ప తనాన్ని తెలుసుకోగలరనే విషయం పాఠ్యక్రమంలో కూడా పొందుపరిచారు. సంగీత జ్ఞానం ఉన్న ప్రతి ఆగంతకుడిని పిల్లలు కనీసం ఒక కొత్తపాటనైనా పాడమని ప్రాధేయపడడంవల్ల పాటల సంగ్రహం పెరుగుతూ ఉంటుంది. సంగీతం





తర్వాత పిల్లలు స్వయంగా తామే అలమ రాలలో ఉన్న పాఠ్యసామగ్రిని తీసుకుంటారు. పిల్లలే తమకు తాము లేదా తమకంటే పెద్దవారైన పిల్లల సహాయంతో చదివేందుకు, అర్థం చేసుకు నేందుకు వీలుగా ఈ సామగ్రిని సరళంగా రూపొందించారు. అధ్యాపకులు పాఠం మొదలుపెట్టే వారుగా కాకుండా పిల్లలకు సహకారం అందించడానికీ, పనిపట్ల ధ్యాస కలిగించడానికీ ఎల్లప్పుడు వారికి అందుబాటులో ఉంటారు.

తెలుగు, ఇంగ్లీష్‌లో తయారుచేసిన ఈ సామగ్రిలో ఎక్కువ భాగం కార్డు, పొదుపుకథలు, స్థానాలు, ఇతర ప్రక్రియలలో ముడిపడి ఉన్న పదకేళి ఉంటుంది. డేవిడ్, ఇతర అధ్యాపకులు బొమ్మలు వేసి వీటిని రాశారు. వీటిని తయారీ చేయడంలో ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. అంశాల క్లిష్టత ఆధారంగా వీటిని వర్గీకరిస్తారు. దీని కారణంగా పిల్లలు ప్రతి అభ్యాసాన్ని పూర్తిచేస్తూ ఒక నిశ్చిత మార్గంలో ముందుకు వెళ్ళ గలుగుతారు. సాధారణంగా పెద్ద పిల్లలకు మధ్యాహ్న భోజనం తరువాత గణిత తరగతులు ఉంటాయి. విద్యావిధానం ఆసక్తి రేకెత్తించేదిగా ఉంటే ఏ సమయమైనా నేర్చుకునేందుకు ఉపకరిస్తుందనే విషయం నిరూపించడానికి ఇలా చేస్తుంటారు.

బాల – బాలికలకు సంగీతం నేర్పించడం, దాన్ని క్యాసెట్ల ద్వారా వినిపించడం, మట్టిపని, కుమ్మరి చక్రంపై పాత్రలు తయారుచేయడం, వడ్రంగి పనిచేయడం, వస్తువులను తయారుచేయడం, ఎంబ్రాయిడింగ్, క్రేయాన్‌లతో, రంగులతో చిత్రాలు వేయడం లాంటివి ప్రధానంగా నేర్పిస్తుంటారు. లింగ వివక్షతలేని ఈ పాఠ్యక్రమం ఒక అద్భుత నమూనా. ఇది మానసిక, శారీరక శ్రమల మధ్య అంతరాలను తొలగించే ప్రయత్నం చేస్తుంది. పాఠశాల కార్యప్రణాళికలో చేతి పనులకు అతి ముఖ్యమైన స్థానం ఉంది. చేతితో పనిచేయడం, దానిలో దక్షతను, అమోఘమైన నైపుణ్యాన్ని తీసుకురావడం, ఒకసారి మట్టిని చేతిలోకి తీసుకున్న తర్వాత ఒక కళాత్మక రూపాన్ని తయారుచేయాలనే పట్టుదల, చిన్న





రంపం చేతిలో ఉన్నట్లయితే జాగ్రత్తగా కొయ్యను కోయడం మొదలైన వాటికి కూడా పాఠ్యక్రమం లో భాష లేదా గణితానికిచ్చినట్లు ప్రాముఖ్యత నిచ్చారు.

విద్య కేవలం మస్తిష్కంలో జరిగే ప్రక్రియ మాత్రమేగాక అది మనిషి పూర్తి వ్యక్తిత్వానికి జన్మ నిస్తుంది. సహ పాఠకులు, అధ్యాపకులతో స్నేహ బలం ఆధారంగా ఆత్మ గౌరవం పెంపొందించుకునే అవకాశం లభించినప్పుడే పిల్లలకు అత్యుత్తమ విద్య లభించే అవకాశముంటుంది. అధ్యాపకుడు, విద్యార్థి మధ్య ఇటువంటి అవగాహన, నమ్మకం ఏ కుటుంబలోనైనా దొరకడం కష్టమే.

క్రమశిక్షణకు సంబంధించి తన దగ్గరికి ఎటువంటి సమస్యా రాదని దానికి కారణం క్రమశిక్షణ గురించి ఎప్పుడూ బలవంతం చేయకపోవడమేనని డేవిడ్ చెబుతూ ఉండేవారు. నీల్‌బాగ్‌లో ఎటువంటి నియమాలు లేవు. ఒక నియ మావళి ఉండేది కాని దాన్ని పాటించాలని ఆదేశించరు. ఆచరణ ద్వారానే ఈ నియమాలను ఆదర్శంగా నిలిపేవారు. ఇందులో అధ్యాపకునికి బోలెడన్ని సవాళ్ళూ, బాధ్యతలు ఉంటాయి. శనివారం ఉదయం 11 గంటలకు బడిని పరి శుభ్రంగా ఉంచాలని నియమముంది. ఇది అందరి విద్యార్థులు, అధ్యాపకుల ఉమ్మడి బాధ్యత. ప్రతి ఒక్కరికి పనిచేసే వంతు రావాలని అందరి మధ్య పనులు విభజించారు. అంతేగాక ఆ బాధ్యతలు మారుతూ ఉంటాయి. చీపురుతో ఊడ్చడం, ఉతకటం, చెత్తా – చెదారం కాల్చడం, బ్లాక్ బోర్డుపై నల్లరంగు వేయడం లాంటి పనులన్నీ నిర్ణయించిన క్రమంలోనే జరుగుతాయి. శనివారం రోజు ఇక్కడ అందరూ చీమల దండులా తమ తమ పనులలో మునిగిపోతారు. డేవిడ్ తన లుంగీని మోకాళ్ళ వరకు మడత పెట్టుకొని ఈలవేస్తూ, ఎక్కడైనా తనవంతు భాగం పని మిగిలి ఉంటే దాన్ని పూర్తిచేయడంలో నిమగ్నమవుతారు.



మొత్తం మీద అక్కడ పనికిమాలిన, నీచమైన పని అంటూ ఏదీ లేదు. బడిలో ఏ పీరియడ్ కూడా విసుగు పుట్టించదు. అలాగే ఏ పాఠం కూడా



ఉపయోగం లేనిది కాదు. చేయదలచిన ఏ పనినైనా పూర్తి పట్టుదల, మంచి పద్ధతిలో చేయాలనేది డేవిడ్ సిద్ధాంతం.

నీల్‌బాగ్‌లో అమలుపరుస్తున్న మరో శాస్త్రీయ సిద్ధాంతం ఉంది. చాలా స్కూళ్ళలో వయసు ప్రకారం తరగతులుంటాయి. ఒకే వయస్సు ఉన్న పిల్లలను ఒకే గదిలో కూర్చొని చదివించడం తేలికగా ఉంటుందనే అభిప్రాయం ఉంది. కాని డేవిడ్‌కు ఇటువంటి బోధనా పద్ధతులపై నమ్మకం లేదు. నేర్చుకునేందుకు అనువైన వాతావరణం ఎంతో ముఖ్యమైనదని ఆయన చెబుతుంటారు. చాలా సార్లు ఆయన పిల్లలతో ఒంటరిగా మాట్లాడేవాడు. అలాగే పిల్లల బృందాని కంతటికీ కలిపి పాఠాలు చెప్పేవారు.




ఒకే గ్రూపులో అన్ని వయస్సుల వారిని కలి పినట్లయితే ఒకరి నుంచి ఇంకొకరు నేర్చుకునే లక్షణం పెరుగుతుందనీ, అలాగే వాళ్ళ మధ్య స్పర్థలు తగ్గుతాయని ఆయన అభిప్రాయం. ప్రతిభ మెరుగుపడాలంటే పోటీ ఉండాలి అనే దానికి నీల్‌బాగ్ విద్యలో ఏ మాత్రం స్థానం లేదు. సమర్థులు కావాలనే కోరిక కలిగి ఉండడం, తరగతిలో ఇతరుల కంటే ముందుండాలనే కోరిక కలిగి ఉండడం రెండూ భిన్న విషయాలని చెబుతూ డేవిడ్ మొదటి విష యాన్నే సమర్థిస్తూ ఉండేవాడు.

నీల్‌బాగ్‌లో ఒకేసారి 30కి మించి పిల్లలు ఎప్పుడూ ఉండేవారు కాదు. డేవిడ్‌కు రాశిమీద నమ్మకం లేదన్నది స్పష్టంగా తెలిసిందే. దీన్నే లక్ష్యంగా పెట్టుకొని ఆయన ఒకేసారి నలుగురు అధ్యాపకులకు శిక్షణ ఇచ్చే ఒక టీచర్ ట్రైనింగ్ కార్యక్రమాన్నికూడా ప్రారంభించారు.

వీరు శిక్షణ సమయంలో నీల్‌బాగ్ విద్యార్థులకు బోధించాల్సి ఉంటుంది. దీనర్థం వారికి సిద్ధాంతాలు కాక పద్ధతులు మాత్రమే నేర్పిస్తారని కాదు. ప్రతి ఒక్కరూ విద్యా తత్వం, మనో విజ్ఞానం, విద్యకు సంబంధించిన ఎన్నో పనులు చేయాల్సి ఉంటుంది. వాటిలో వారు చదివిన పుస్తకాలను చర్చించడం ఒకటి. అధ్యాపకులు తమ ఆలోచనా ప్రక్రియ పెంచుకోవడానికి, జ్ఞానాన్ని పంచు కోడానికి సెమినార్లు, చర్చా గోష్ఠులు వంటి అనేక అవకాశాలు కల్పించేవారు.

అధ్యాపకులను ఆలోచింప చేయడమేకాక తమ జ్ఞాన పరిధులను అభివృద్ధి పరచుకునేందుకు ఇవన్నీ అవసరం. మొదట్లో శిక్షణా కాలం ఒక సంవత్సరంగా నిర్ణయించినప్పటికీ ఈ సిద్ధాంతం యొక్క అవగాహన, అన్ని పుస్తకాలను విమర్శనాత్మకంగా అధ్యయనం చేయడం, శిక్షణలో పరిపూర్ణ ఆత్మ విశ్వాసం, దక్షత కలిగి ఉండడానికి కనీసం రెండు సంవత్సరాలైనా ఉండాలని డేవిడ్ భావించారు.

కవిత్వం జీవితంలో అనివార్యమని దీనివల్ల అంతర్ దృష్టి పదునెక్కుతుందని, ఇది మానవీయ ఆవేదనను విస్తృతపరుస్తుందని డేవిడ్ అభిప్రాయం.



విద్యాపరమైన సిద్ధాంతాల ఆధారంగా డేవిడ్ పిల్లలతో విలువైనదిగా భావించే ప్రతి విషయం గురించి చర్చిస్తుంటారు. వారంలో రెండు, మూడుసార్లు ఆయన ఇంగ్లీష్ కవితలను, అప్పుడప్పుడూ స్వంత కవితలనూ విన్పిస్తూ ఉంటారు. సందర్భం వచ్చినపుడు సామెతల తళుకు- బెళుకుల (గూడార్థాల)ను వివరిస్తూ ఉంటారు. మెల్ల - మెల్లగా పిల్లలు స్వయంగా డేవిడ్ స్వంత లైబ్రరీ నుండి కవితలను ఎంపిక చేసుకుని చదువుతుంటారు. తర్వాతి కాలంలో చాలామంది పిల్లలు స్వయంగా ఇంగ్లీష్‌లో కవితలు రాయడం కూడా మొదలుపెట్టారు. చాలావరకు పిల్లల కవితలు స్పష్టంగానే ఉండేవి. పిల్లలు తమ అభిరుచికి తగ్గ విషయాల గురించి తెలుగులో కూడా రాస్తున్నప్పుడు తాను నాటిన మొక్క ఇప్పుడు ఫలాలనిస్తోందని డేవిడ్‌కు విశ్వాసం కలిగేది.

సెకండరీ స్థాయికి చేరుకున్న పిల్లలు ఆంధ్రప్రదేశ్ సెకండరీ పరీక్షలకు హాజరవుతారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న స్కూళ్ళలో చదవని విద్యార్థులు ప్రైవేటు విద్యార్థులుగా పరీక్షలు రాయవచ్చు. పరీక్షా బోర్డు నుండి నీల్‌బాగ్‌కు గుర్తింపు లభించలేదు. ఆంగ్ల (సాహిత్య) చరిత్ర, పౌర శాస్త్రాలను నీల్‌బాగ్‌లోని అధ్యాపకుల సహకారంతో చదివి ఉన్నందున విద్యార్థులు వాటినే పరీక్షా విషయాలుగా ఎంపిక చేసుకుంటారు. ఇటువంటి స్థితిలో కూడా పిల్లలు పూర్తి సమయంలో కనీసం మూడవవంతు సమయాన్ని పరీక్షేతర వ్యవహారాలలో గడపవలసి ఉంటుంది. ఆయనకి సంస్కృతమంటే ఇష్టం, బడిలో సంస్కృత బోధన అవసర



మని భావిస్తూ ఉంటారు. పిల్లలు తరచుగా సంస్కృతంలో చర్చలు నిర్వహించేవారు. కవితలు లేదా లఘు నాటికలను చదివే ప్రయత్నం చేస్తుంటారు.



రంగస్థలానికి సంబంధించిన కార్యక్రమాలు కూడా పాఠ్యక్రమంలో భాగమే. సంవత్సరానికి ఒకటి లేక రెండుసార్లు పిల్లలు షేక్స్‌పియర్ నాటకాలలోని ఏదో ఒక దృశ్యాన్ని అభినయిస్తారు. నాటకానికి సంబంధించిన వేష భూషణలు, ఇతర సామగ్రి నంతటిని పిల్లలే స్వయంగా తయారు చేసుకుంటారు. వేదికమీదకు టార్చ్ ద్వారా కాంతి (లైటింగ్)ని పంపే బాధ్యతని చుట్టుపక్కలున్న చెట్లపై కూర్చొని పిల్లలే నిర్వహిస్తుంటారు. వేదికమీదకు కాంతి ప్రసరింప చేయడానికి డేవిడ్ ఆస్టిన్ కారు హెడ్‌లైట్‌ను కూడా ఎన్నోసార్లు ఉపయోగించేవారు. ఈ మొత్తం కార్యక్రమం అందరికీ మజాగా ఉంటుంది. వారు అందరూ ఈ పనులలో పూర్తిగా లీనమై కలసికట్టుగా, క్రమ శిక్షణ కలిగిన బృందంగా వేషభూషణలు తయారుచేస్తారు. అలంకరణ లోనేగాక పాత్ర పోషణలో నటులకు సహాయపడుతూ ఉంటారు. బెంగుళూరు, మద్రాసులలో ఉన్న బ్రిటిష్ కౌన్సిల్ లేదా డేవిడ్ మిత్రుల ఇళ్ళలోనూ నాటక ప్రదర్శనలివ్వడానికి వెళుతూ ఉండేవారు.

పిల్లలకు ఇంటిపని (Home Work) ఇచ్చేవారు. కానీ దాన్ని పూర్తి చేయడానికి కావలసినంత సమయం ఉండేది. చాలామంది పిల్లలు తమ తల్లిదండ్రులతో పాటు ఒకే గుడిసెలో ఉండడంవల్ల అక్కడ వారికి హోమ్‌వర్క్ చేసుకోడానికి కావలసినంత చోటు, సమయం దొరకడం అసంభవమే. అందుచేతనే పిల్లలు సాయంత్రం పూట బడికివచ్చి ఇక్కడి గదులలో పెద్ద వారెవరి సహాయం లేకుండానే తమ హోమ్‌వర్క్ పూర్తిచేస్తారు. రాత్రి 9.30 గం.లకు డేవిడ్ అక్కడకు వచ్చి పిల్లలతోపాటు వాళ్ళ ఇళ్ళవరకు వెళ్ళి అక్కడ వారిని వదలి వచ్చేవారు.

నీల్‌బాగ్‌లో ఇటువంటి ఎన్నో సంగతుల గురించి చెప్పుకోవచ్చు. వాటి సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంటుంది. కాని మనం దాని కేంద్రీయ విషయాన్నే చూడాలి. ఎవరైనా అధ్యాపకుడు ఏవిషయాన్నైతే ముఖ్యమని

భావిస్తాడో దాన్నే అతడు అన్నిటికంటే బాగా నేర్పించగలడు. కేవలం ఆజ్ఞాపించడమే శిక్షణ కాదు. నేర్చుకునే వాళ్ళ వద్దకు ఏదైనా విలువైన విషయాన్ని తీసుకుపోవడమే శిక్షణ. ఎప్పుడైతే విద్యార్థులు మేధావులుగా, ఉత్సాహవంతులుగా గుర్తింపబడతారో అప్పుడు వారినుంచి ఆశించినవన్నీ పూర్తిచేస్తారు. ప్రతి విద్యార్థికి కొన్ని ప్రత్యేక ప్రతిభలు, సామర్థ్యాలు లేదా బలహీనతలు ఉండవచ్చు.

ఏ విద్యార్థికైనా అతని అభిరుచులు, సామర్థ్యాల సంపూర్ణ వికాసంలో ఒకమంచి ప్రణాలిక సహాయకారిగా ఉంటుంది. విద్యార్థి నేర్చుకునే సామర్థ్యంపై నమ్మకం ఉంచి అధ్యాపకులు ముందుకు వెళ్ళాల్సి ఉంటుంది. అప్పుడే ప్రతి విద్యార్థి తన యోగ్యత ఆధారంగా స్వయంగా తనదైన రీతిలో విషయాలను అవగతం చేసుకుంటారు. ఇటువంటి సంవేదనా శీలురైన మనుషులు, కళాకారులూ అయిన అద్భుత అధ్యాపకుల పర్యవేక్షణలో ఒక పిల్లవాని వ్యక్తిత్వం అనంతంగా వికసిస్తుంది.

**మూలం:** ఎస్.ఆనందలక్ష్మి

ది హిందూ దినపత్రికలో1997 సెప్టెంబరు 14, 21 తారీకులలో ప్రచురితం

**హిందీ అనువాదం:** దేవయాని







# పాఠశాల విద్య - ఓ కొత్త దృష్టికోణం

**డేవిడ్ హార్స్‌బరోతో రోజాలింద్ ఇంటర్వ్యూ**

ఈ ఇంటర్వ్యూతోపాటు 'ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ క్వార్టర్లీ' (10వ సంచిక, 1వ సంపుటి, 1983) పత్రిక సంపాదకుని వివరణ అచ్చయింది – పిల్లల పుస్తకాల రచయితగా డేవిడ్ పేరు సుపరిచితమే. భారతదేశంలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ద్వారా అచ్చయిన ఆయన పుస్తకాలలో గణితం మొదలు పర్యావరణం వరకు అన్ని విషయాలకు సంబంధించి ఉన్నాయి.

డేవిడ్‌కు చెందిన నీల్‌బాగ్ బడిలో ఇప్పుడు రెండు సంవత్సరాలు మొదలు కొని 21 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులున్నారు. సాధారణంగా ఉండే క్లాస్‌రూమ్ పద్ధతిని ఇక్కడ అనుసరించరు. విద్యార్థులందరూ ఇక్కడ ఒకేచోట కూర్చుంటారు. పరీక్షలసలే జరగవు. బడిలోని ప్రతి విద్యార్థి తమ సామర్థ్యాన్ననుసరించి విషయాలను తెలుసుకుంటారు, నేర్చుకుంటారు. ఇక్కడ అధ్యాపకుడుకీ, విద్యార్థికీ నేర్చుకోవడం అనేది ఒక నిరంతర ప్రక్రియ.

దీని ఫలితాలేవిధంగా ఉన్నాయి? డేవిడ్ ఢిల్లీ వచ్చినదు ఆయన కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశాం. పేరొందిన పిల్లల పత్రిక 'టార్గెట్' సంపాదకురాలు రోజాలిండ్ విల్సన్ ఆయనను ఇంటర్వ్యూ చేశారు.




**రోజాలిండ్:** డేవిడ్! మీరు బ్రిటిష్ కౌన్సిల్ అధికారిగా ఉన్నారు. అలాగే ఒక గొప్ప అధ్యాపకునిగా, రచయితగా ఎంతో కాలంగా భారతదేశంలో ఉంటున్నారు. నీల్‌బాగ్ స్కూల్ ప్రారంభించడానికి మీకు ప్రేరణనిచ్చిన విషయమేది?

**డేవిడ్:** భారతదేశ యాత్రకు రావడం నాకు ఇదే మొదటిసారనిపిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం సందర్భంగా రాయల్ వైమానిక దళంలో భాగంగా నేను మొదటిసారి భారతదేశం వచ్చాను. ఆ రోజుల్లో భారత్‌లో అంతర్భాగమైన నేటి బంగ్లాదేశ్‌లోని ఛిట్టగాంగ్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఆ రోజుల్లో నేను నా సెలవుల్లో కొంత సమయాన్ని చిట్టగాంగ్‌కు ఇరవై మైళ్ళ దూరంలో ఉన్న టాపూనుమా గ్రామంలో గడుపుతుండేవాణ్ని. వరిపొలాలతో నిండిన ఆ గ్రామంలో రెండే కుటుంబాలుండేవి. ఒకటి హిందూ, మరొకటి ముస్లిం కుటుంబం. రహదారులుండేవి కావు. కేవలం జలమార్గాలే ఉండేవి. జీవితంలో పని అంటూ చేస్తే ఏదైనా గ్రామీణ పాఠశాలలో పనిచేయాలన్న కోరిక నాకు ఇక్కడ స్కూల్‌ను చూసినప్పుడే కలిగింది.

యుద్ధం తర్వాత నేను తిరిగి ఇంగ్లండుకు వెళ్ళాను. అక్కడ నేను డిగ్రీ తీసుకొని 1950లో భారతదేశం రావడంతోటే నా జీవితం మళ్ళీ ప్రారంభమైంది. మైసూర్‌లో నేను ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా బోధన మొదలుపెట్టిన తర్వాత కొన్నేళ్ళు రుషి-వ్యాలీలో పనిచేశాను. 1959లో బ్రిటిష్ కౌన్సిల్‌లో ఉద్యోగంలో చేరి 1972లో స్వంత స్కూలు ప్రారంభించాలని దాన్నుండి విడిపోయాను. ఏదో ఒక రూపంలో ఈ సమయాన్నంతా నేను శిక్షణలోనే గడిపాను. పూర్వ ప్రాథమిక స్థాయి మొదలు బి.ఎ. వరకుగల అన్నిస్థాయిల్లో బోధించే అవకాశం కలగడం నిజంగా నా అదృష్టమే.

**రోజాలిండ్:** ఈ మీ అనుభవాలు మీ బడిలో ప్రతిబింబిస్తున్నాయా?





**డేవిడ్:** అవును. నా ఆలోచన ముఖ్యంగా గ్రామీణ బడికి సంబంధించింది. ఈ బడిపై ఇవాన్ ఇలిచ్ మొదలు ఎ.ఎస్.నీల్ వరకు అందరి ప్రభావాలను చూడవచ్చు. ప్రస్తుతం ఉన్న బడులకు పూర్తి భిన్నమైన బడులను చూడాలని నాకోరిక.

**రోజాలిండ్:** అంటే ప్రస్తుతమున్న బడులు సరిగ్గా పనిచేయడంలేదనా మీ అభిప్రాయం?

**డేవిడ్:** అవును. కొంత మేరకు అవి సరిగ్గా పనిచేయడంలేదనే చెప్పగలను.

**రోజాలిండ్:** అయితే మీరు నీల్‌బాగ్ ప్రారంభించారు కదా! ఈ బడికి సంబంధించి ఎటువంటి విషయాలు పిల్లల్ని ఆకర్షిస్తున్నాయనుకుంటున్నారు?

**డేవిడ్:** అన్ని స్కూళ్ళు జైళ్ళు, పిల్లలు తప్పని సరిపరిస్థితుల్లో అక్కడికి వెళుతుంటారని నీల్ చెప్పిన విషయాన్ని మీరు దృష్టిలో ఉంచుకోవాలి. బడికి వెళ్ళాలా? వెళ్ళకూడదా అన్న మీమాంస ఎదురుకాని ఒక స్కూలును నేను స్థాపించాలనుకున్నాను. ఇక్కడికి రావడమా? రాకపోవడమా? అన్నది పిల్లలే తమ మనస్సులో ఆలోచించుకొని నిర్ణయం తీసుకుంటారు. ఎటువంటి బలవంతమూ ఉండదు. శిక్ష అనే పదంలేని స్కూలును నేను స్థాపించాలనుకునేవాణ్ని.



**రోజాలిండ్:** మీరు చెప్పిన విషయాలు ఎ.ఎస్.నీల్ చెప్పినట్లుంది?

**డేవిడ్:** అవును, అయితే ఏ.ఎస్.నీల్ చెప్పిన కొన్ని విషయాలను నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. ఏ రకమైన శిక్షనూ విధించడానికి ఇష్టపడనప్పుడు ఎటువంటి నియమాన్ని కూడా విధించలేరు. మీరు ఏవైనా నియమాలను విధించాలనుకున్నప్పుడు వాటిని అమలుపరచడానికి చివరికి మీరు ఏదో ఒక రకమైన వత్తిడి తేవాల్సి ఉంటుంది. చివరకు 'మా జీవన శైలిలో మిమ్మల్ని మీరు మరల్చుకోలేకపోతే, క్షమించండి మీరు మాతో ఉండడానికి వీల్లేదు' అని మీరే అంటారు.

అన్ని స్కూళ్ళ పాఠ్యక్రమం చాలా లోపభూయిష్టంగా ఉందని నాకనిపిం



చింది. 12-13 ఏళ్ళ వయస్సులో పిల్లవాళ్ళలో సృజనాత్మక శక్తి తారస్థాయిలో ఉన్నపుడు పరీక్ష వత్తిడి కారణంగా వారి సృజనాత్మక మార్గాలన్నీ మూసుకుపోతాయి. పరీక్షను అనివార్యంగా భావించడమే దీనికి కారణం. ఈ సందర్భంగా నేను పిల్లలపై పరీక్షల వత్తిడి ఉండకూడదనే నిర్ణయం తీసుకున్నాను. స్కూల్ ప్రారంభమై ఏడేళ్ళు అయినప్పటికీ ఎప్పుడూ మేం పరీక్ష నిర్వహించలేదు. తరగతుల విభజనే పిల్లలు బడి మానివేయడానికి లేదా తప్పడానికి ప్రథమ కారణమని నేను భావిస్తున్నాను. అందుకే మేము ఒకటవ తరగతి, రెండవ తరగతి అని క్లాసులు ఏర్పాటుచేయలేదు. దీనివల్ల ప్రయోజనమేమంటే పిల్లలు తమ సామర్థ్యాన్నిబట్టి చదవడానికి, వికాసం చెందడానికి అవకాశముంటుంది. పిల్లలు ప్రస్తుతం తామున్న స్థితి కంటే మెరుగైన స్థితికి చేరుకోగలుగుతారు.

**రోజాలిండ్:** అటువంటప్పుడు పిల్లల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని అధ్యాపకుల సంఖ్యను పెంచాల్సి ఉండదా?

**డేవిడ్:** నాకు అలా అనిపించడంలేదు. 25 మంది విద్యార్థులకు నేనొక్కడినే ఇంగ్లీష్ బోధించగలను. కాని చాలావరకు గ్రామీణ స్కూళ్ళతో పోల్చినప్పుడు ఇక్కడి విద్యార్థులు, అధ్యాపకుల నిష్పత్తి చాలా తక్కువ.

**రోజాలిండ్:** అటువంటప్పుడు మీ విద్యాస్థాయి కూడా మెరుగ్గా ఉండాలి కదా?

**డేవిడ్:** చదువు గురించి నా భావన భిన్నమైంది. కేవలం బోధించడమే అధ్యాపకుని బాధ్యతకాదు. దీనితోపాటు ప్రతి విద్యార్థి తన స్థాయిలో విషయాలను నేర్చుకునేందుకు అవసరమైన వాతావరణాన్ని కలుగచేయడం కూడా అధ్యాపకుని పనే. "చూడు మిత్రమా! ఒక వేళ నీకు రాజనీతి గురించి ఏమీ తెలియకపోతే విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రాన్ని ఎలా బోధించగలవు?" అని కొంతమంది నాతో అంటుంటారు. కాని ఎవరికో ఎంతో కొంత నేర్పించడం, లేదా బోధించడం నా విధి కాదు. సాధారణంగా మనం ఒక అధ్యాపకుడిని అన్నీ తెలిసిన వ్యక్తిగా ఊహిస్తుంటాం. ఇతరులకు జ్ఞానాన్ని కలుగచేయడం అతనిపని. రాజనీతిశాస్త్రంలో పట్టాపొందిన వ్యక్తి రాజనీతి శాస్త్రాన్ని, సాహిత్యంలో ఎం.ఏ.



చేసిన వ్యక్తి సాహిత్యం, అలాగే చరిత్రలో డిగ్రీ పొందిన అధ్యాపకుడు చరిత్రను బోధిస్తారనే విషయం మనందరికీ తెలిసిందే. వాస్తవానికి పిల్లలకు బోధించడం కన్నా వారిని నేర్చుకునే ప్రక్రియలో భాగస్వామిగా చేయడం అనేది మూల విషయం.

**రోజాలిండ్:** మళ్ళీ ఒకసారి మీ బడి స్థాపన గురించి మాట్లాడుకుందాం. బడిలో ఎటువంటి నియమమూ ఉండదని, ఎవరికీ శిక్ష విధింపబడదని, అలాగే బడికి రావడం, పోవడంలో పిల్లలు స్వతంత్రులని మీరు నిర్ణయించారు కదా! అలాంటప్పుడు వారు బడికి రావాలంటే చాలా ప్రబలమైన ప్రేరణగాని, కారణంగాని ఉందంటారా? బడిలో బోధించే అంశాలు, వాటినుపయోగించే పద్ధతులు, ఉపకరణాలు గురించి మీకు ఆలోచించాల్సిన అవసరం ఏర్పడిందా?



**డేవిడ్:** అవును. దీనికి ప్రబలమైన ప్రేరణ అవసరం. పిల్లలను నేర్చుకోడానికి ప్రేరేపించే అంశం గురించి నేను తీవ్రంగా ఆలోచించాను. పిల్లల్లో నేర్చుకోవడం, చదువుకోవడం అనేది ముఖ్యమైన విషయం. మా బడిలో పోటీకీ ఎటువంటి స్థానంలేదు. మేం మార్కులు, గ్రేడు, లేక ప్రమోషన్ లాంటివివ్వం. మా దగ్గర శిక్షకు సంబంధించి ఎటువంటి ఆలోచనాలేదు. పతకాలుగాని, బహుమతులుగాని ఇవ్వం. వీటన్నింటినీ మించి పిల్లలను ప్రోత్సహించడానికి కూడా కొత్త పద్ధతులను అనుసరిస్తామనేది స్పష్టమవుతుంది. విద్యార్థుల తమ ప్రయత్నంలో విజయం సాధించగలిగినప్పుడు అదే వారికి అన్నింటినీ మించిన ప్రోత్సాహం. ఎలాంటి స్థాయి, తరగతి, గ్రేడు, వ్యవస్థలేని నా ప్రణాళికలో ప్రతి పిల్లవాడు తన సహజమైన పద్ధతిలో విజయాన్ని సాధించగలడు. అతను విజయం సాధిస్తుండడం అతన్ని ఇంకా నేర్చుకోడానికి, తెలుసుకోడానికి ప్రేరేపిస్తూ ఉంటుంది.

తరగతిలో 35 మంది పిల్లలు ఉంటే 60 నుండి 70 శాతానికి అనువైన గతిని అధ్యాపకుడు అవలంబించాల్సి ఉంటుంది. ఇది కొంతమంది పిల్లలకు చాలా వేగంగా ఉందనిపిస్తే కొంత మంది తెలివైన పిల్లలకు తాబేలు నడకలా అనిపించవచ్చు. అటువంటి స్థితిలో ఈ రెండు రకాల పిల్లల మనస్సు విరక్తికి



లోనవుతుంది. ఈ విధంగా మందగతిలో ఉన్న పిల్లలు ఏమీ నేర్చుకో లేకపోతున్నారు. అలాగే చురుగ్గా ఉన్న పిల్లలు హతాశులవుతారు.

అధ్యాపకుడు మొదటినుండి తనకు తెలిసిన విషయాలనే పునరావృత్తం చేయడమే దీనికి కారణం. మా ప్రణాళికలో తెలివైన పిల్లవాడు నాలుగేళ్ళ సామగ్రిని ఒక సంవత్సరంలోనే చదవగలుగుతాడు. ఇక్కడి ఒక విద్యార్థి నాలుగు సంవత్సరాలకు ఉద్దేశించిన ఇంగ్లీష్ పుస్తకాలను ఒకే సంవత్సరంలో చదివాడు. అదే సమయంలో ఎవరైనా పిల్లవాడు విభిన్న కారణాలవల్ల ఏదైనా విషయాన్ని నేర్చుకోవడం కఠినంగా భావిస్తున్నప్పుడు ఒక సంవత్సరానికి బదులు ఒకటిన్నర లేదా రెండు లేదా ఎంత సమయంలో అతను నేర్చుకోగలుగుతాడో అంత సమయం తీసుకుంటాడు. కాని మందగతిలో నేర్చుకున్నప్పటికీ వారిని కూడా విజయం వరిస్తుంది. అంటే దీని అర్థం కొంతమంది పిల్లలు తెలివిగా లేక చురుకుగా ఉండరని కాదు. నిస్సందేహంగా అలాంటి వాళ్ళూ ఉంటారు.

**రోజాలాండ్:** వ్యావహారిక విద్య గొప్పతనం గురించి, దానిపట్ల వారు ఆకర్షితులయ్యేలా ప్రోత్సహించే ఏ అంశమూ మీకు కనిపించలేదా?

**డేవిడ్:** కనిపించలేదు. పిల్లలతో ఏమాత్రం ఆ విధంగా ప్రవర్తించకూడదు. విద్యావంతులు కానంతవరకు మీరు దాని గొప్పతనాన్ని తెలుసుకోలేరు అనేది విద్యకు సంబంధించిన ఒక పచ్చి నిజం. ఎవరైనా గ్రామీణునికి విద్య చాలా అవసరం అని చెప్పాల్సిన అవసరం లేదు. "ఒకవేళ నేను 10వ తరగతి వరకు చదవగలిగితే నేను ఏదైనా ప్రభుత్వ ఆఫీసులో బంట్రోతు కాగల"ననే విధంగానే దాని గొప్పతనాన్ని అర్థం చేసుకుంటాడు. అయితే విద్య అంటే కేవలం ఇదే కాదు. విద్యావంతుడు కాని ఏ వ్యక్తి అయినా విద్యయొక్క వాస్తవిక ప్రయోజనాన్ని తెలుసుకోలేడు.

**రోజాలాండ్:** ఆనందం కలిగించే పనిగా విద్యను భావిస్తున్నారా?

**డేవిడ్:** అవును. పిల్లలకు ఆనందం కలగడమే మొదటి అంశం. వాస్తవంగా కూడా ఇందులో పిల్లలకు చాలా మజా కలుగుతుంటుంది. వారు మంచి జిజ్ఞాసువులు కావటంవల్ల ఆటలంటే వారికి చాలా ఇష్టముంటుంది. అంతేగాక వారు



తమ సామర్థ్యాలను గుర్తించగలిగినప్పుడు కొత్త నేర్పును సొంతం చేసు కొనే ప్రయత్నంలో మునిగిపోతారు.

**రోజాలిండ్:** కానీ పిల్లలతో శారీరక శ్రమ చేయించడానికి మీరు కొన్ని ప్రయత్నాలు చేయవలసి వచ్చింది కదూ? మీకు ఒక ఖచ్చితమైన టైమ్‌టేబుల్ ఉందా? తరగతుల నిర్మాణం పిల్లలే స్వయంగా చేసినట్లు మీరు ఎక్కడో రాసినట్లుంది?

**డేవిడ్:** మాకు టైంటేబుల్ ఉంది. కాని ఇది చాలా ఖచ్చితమైనది కూడా కాదు. అయితే తరగతికి రావడం, రాకపోవడంలో విద్యార్థులు స్వతంత్రులు. గాంధీజీ ఆశించిన విధంగా ఇక్కడ శారీరక శ్రమ చేయించలేదు. పిల్లలు తమ తరగతుల నిర్మాణం చేపట్టారు. కాని ఇది కూడా వారి విద్యలో ఒక సాధారణ భాగమే.

మా పాఠ్యక్రమం చాలా వ్యాపకమైనది. పిల్లల మాతృభాష తెలుగు కాగా, రెండవ భాషగా ఇంగ్లీష్‌ను నేర్చుకుంటారు. అంతేకాక పాఠ్యక్రమంలో గణితం, విజ్ఞానశాస్త్రం, పర్యావరణ విద్య, కళ, హస్తకళ (శిల్పం), మట్టిపనితోపాటు కొయ్యపని మొదలైనవి కూడా ఉన్నాయి.



**రోజాలిండ్:** పాఠ్యక్రమం ఇలా ఉండాలని ఎలా నిర్ణయించారు?

**డేవిడ్:** మా విచక్షణ ప్రకారమే చేశాం. వాటిని రూపొందించే వారి వివేకానికి కార్యక్రమాలు అద్దంపడతాయి. ఇది పాఠ్యక్రమం రూపొందించే వారి ఇష్టం అని కూడా చెప్పవచ్చు. ఉదాహరణకు తత్వశాస్త్రం కూడా బోధిస్తాం. పిల్లలకు తత్వశాస్త్రం అనంత విధాలుగా ఉపయోగపడగలదని నా అభిప్రాయం. కాని బహుశా మీరు అలా భావించరేమో. అలాగే ఇతర బడులు పాఠ్యక్రమంలో తత్త్వశాస్త్రానికి చోటు లభించలేదు. కొంతమందికి దాని అవసరం ఉండకపోవచ్చేమో. మేం సౌందర్యశాస్త్రం (ఈస్తటిక్స్) కూడా బోధిస్తాం. అలాగే సంగీతాన్ని ఆస్వాదించడంతోపాటు తర్క – వితర్కానికి సంబంధించిన మెలకువలు కూడా నేర్పుతాం. ఇప్పుడు ఈ విషయాలన్నీ పిల్లలకు అత్యవసరమని నా కనిపిస్తుంది. కానీ మీకు ఈ విషయాలన్నీ సాధారణ పాఠ్యక్రమాలలో కనిపించవు.

ఇదేవిధంగా మేం మట్టిపాత్రలను తయారుచేయడం కూడా నేర్పుతాం. అప్పుడప్పుడూ సందర్శకులు మా కుమ్మరి విభాగాన్ని చూసి "చదువు పూర్తి అయిన తర్వాత జీవనోపాధికోసం పిల్లలకు కుమ్మరిపని కూడా నేర్పిస్తున్నారా? చాలా బాగుంది" అని వ్యంగ్యంగా అంటుంటారు. నాకు ఇలాంటి ఉద్దేశమేదీ లేదు. పనిలో భాగంగా నేర్చుకోవడం అవసరమని నాకనిపిస్తుంది. మీరు ఐరిక్ గిల్ అనే శిల్పి గురించి వినే ఉంటారు. విద్య గురించి ఆయన ఎంతో రాశారు. ఒక విషయం గురించి ఆయన ఈ విధంగా చెప్పారు. – 'మనం పిల్లలకు వనరుల వినియోగం గురించి ఎప్పుడూ బోధించం. ఆలోచన, అభ్యాసం, ఆటలు ఇంకా ఎన్నో, ఎన్నో బోధిస్తాం. కాని వనరుల వినియోగం గురించి ఎప్పుడూ బోధించం. ఏదైనా పదార్థం తనను ఉపయోగించే వారిలో ఎలాంటి స్వభావాన్ని కలుగచేస్తుంది అనే విషయం పిల్లలు తెలుసుకోవాలని నా అభిప్రాయం. ఇది గొప్పవారు చెప్పిన దానికి భిన్నంగా ఉంటుంది. ఒకవేళ నేను ఇంగ్లీష్‌లో పొరపాట్లు చేసినట్లయితే మీరు నన్ను సరిదిద్దవచ్చు. అలాగే నా పొరపాటు పునరావృతం కాకుండా చేయవచ్చు. కాని ఒకవేళ నేను కుమ్మరివాని చక్రంమీద కూర్చుని పనిచేస్తూ తప్పుచేస్తే ఆ మట్టే స్వయంగా 'నువ్వు సరిగ్గా పనిచేయడం లేదు చూడు' అని చెబుతుంది. ఒకవేళ చిత్రిక గుల్లను కొయ్యమీద తప్పుగా ఉపయోగించినట్లయితే అది నున్నగా కాకుండా మరింత గరుకుగా తయారవుతుంది. ఈవిధంగా కొయ్య స్వయంగా పిల్లవాణ్ని తన స్వభావానికి అనుగుణంగా మార్చుకుంటుంది. నిజంగా ఇదొక అద్భుత విషయం. దీనికోసం బయటినుండి రుద్దబడే క్రమశిక్షణ అవసరంలేదు, ఎందుకంటే ప్రతి వస్తువుకు తనదైన ఒక ప్రకృతి, గుణం ఉంటాయి.

**రోజాలిండ్:** మీ విద్యార్థులు, బడి నుండి బయటకు వచ్చిన తర్వాత ప్రధాన జీవన స్రవంతిలో కలిసిపోవాలనే కాంక్ష వారిలో ఉంటుందా?

**డేవిడ్:** ఇప్పటివరకూ పూర్తిగా మా బడినుండి సుశిక్షితుడై ఏ విద్యార్థీ బయటకు రాలేదు. మా దగ్గరకు ఇటీవలే ఒక కుర్రవాడు బి.ఏ. పూర్తిచేశాడు. పి.యు.సి. పరీక్షలో తప్పినందువల్ల బడి మానేసిన గ్రామీణ యువతలో ఇతడొకడు. డిగ్రీలో ఉత్తీర్ణుడు కావడంలో మద్దతిస్తామని చెప్పాను.

మా దగ్గర ఒక పిల్లవాడున్నాడు. అతను ఐ.ఎ.ఎస్. చేయాలనుకుంటు



న్నాడు. ప్రతివారం మేం ఒక మాటా– మంతి కార్యక్రమాన్ని ఏర్పాటుచేస్తాం. ఇందులో పిల్లలను వారి భవిష్యత్తు ప్రణాళికల గురించి అగుడుతాం. వారిలో చాలా మంది ఇప్పటికేదీ నిర్ణయించుకొని ఉండరు. పిల్లలకు ఉన్నత స్థాయిలో విద్యను అందచేస్తున్నామని, వారి ఇంగ్లీష్ చాలా బాగుందని (12–13 ఏళ్ళ వయసున్న మా పిల్లలు షేక్స్పియర్ ఏదో నాటకాన్ని చదువుతున్నారు) అని అంటుంటారు. ఇది ఇంగ్లీష్ మాధ్యమం పాఠశాల మాత్రంకాదు. కానీ రెండు భాషలు నేర్పించే బడుల దృష్ట్యా చూస్తే ఇది చాలా ఉన్నతస్థాయిలో ఉంది. షేక్స్పియర్ అంటే పిల్లలకు మహాపిచ్చి. ఆయన రచించిన ఒథెల్లో వారికి ప్రపంచ ప్రసిద్ధ నాటకం. ఈ మధ్య వారు దాన్నే చదువుతున్నారు.

మీరు పిల్లలను గ్రామాలకు దూరం చేస్తున్నా రంటూ ప్రజలు నన్ను విమర్శిస్తూ ఉంటారు. పట్టణవాసులే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ ఉంటారు. వాళ్ళను మోసం, దగా చేయడానికి మాత్రం ఇక్కడకు రాలేదని మాత్రమే చెప్పగలను. వారి సామర్థ్యాన్ననుసరించి వాళ్ళకు మెరుగైన విద్యనం దించడం తద్వారా వారి మొత్తం సత్తా, ఊహలను మెరుగుపరుచుకొనే అవకాశం లభించాలని, దీంతోపాటూ వాళ్ళూ ఆలోచించాలని, అనుభవం కలవాళ్ళు కావాలని, స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉండాలని, విషయాలను అర్థం చేసుకోవాలని, తమని తాము అభివ్యక్త పరచుకోవడం, వస్తువుల ఉపయోగం తెలుసుకోవడం, పర్యావరణాన్ని అర్థం చేసుకోవడం, ఇలాంటి ఎన్నో విషయాలను తెలుసుకోవాలనే ఒకే ఒక ఉద్దేశంతోనే నేనిక్కడున్నాను. అటుతరువాత వాళ్ళు ఏం చేయాలనుకుంటున్నారనే విషయం గురించి నేను పట్టించుకోను. గ్రామాల్లో ఉంటూ ఇతరులకు సహకరించాలని నేను వారితో చెప్పను. ఒకవేళ వారు స్వయంగానే అలా చేయాలనుకుంటే మనస్ఫూర్తిగా చేయవచ్చు. లేదా ఒకవేళ వారు ఏదైనా పెద్ద నగరానికిపోయి చిత్రకారులు కావాలనుకుంటే అదీ మంచిదే. నేను వాళ్ళు ఏమిచేయాలో చెప్పడానికి లేను.



**రోజాలిండ్:** గ్రామీణ పిల్లలకోసం ఒకమంచి పాఠ్యక్రమాన్ని తయారు


చేయడం వెనుక మీ ఉద్దేశం వారికి మంచి ఉపాధి లభించాలనా?

**డేవిడ్:** గ్రామీణ పాఠ్యక్రమానికి సంబంధించినంతవరకు నాకే ఉద్దేశం లేదు. ఇదంతా వ్యర్థ ప్రేలాపన. దీన్ని 5 శాతం ఉన్నత విద్యావంతులు, పేరు, ప్రఖ్యాతులున్న వారు, దేశ రాజకీయ అధికారంపై పట్టున్న వారు నగరవాసులు చేశారు. వీరికి విద్యా ప్రణాళికలపై నియంత్రణ ఉంది. అంతేకాక వీరే గ్రామీణ జనాభాను విద్యకు దూరం చేస్తున్నారని నేను ఖచ్చితంగా చెప్పగలను. మూడునెలల కిందట ఢిల్లీ నుండి ఒక సర్వే ప్రచురితమయ్యింది. దాని ప్రకారం దేశం మొత్తంమీద 65 శాతం పిల్లలు 5వ తరగతి తరువాత చదువు మానేస్తున్నారు.



ఈ సంఖ్య పెరుగుతూ ఉండవచ్చని నాకు అనిపిస్తుంది. ఈ 5 శాతం పిల్లలు 5వ తరగతి తరువాత చదువు మానేస్తున్నారు.

ఈ సంఖ్య పెరుగుతూ ఉండవచ్చని నాకు అనిపిస్తుంది. విద్యా -పాఠ్య క్రమం ఈ 5 శాతం పేరు ప్రఖ్యాతులున్న నగర వర్గాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యా–పాఠ్యక్రమం తయారు అవుతోంది. అంతేకాక అన్ని వనరులు ఈ వర్గానికే కేటాయించబడుతున్నాయి. గ్రామీణ ప్రాంత బడులలో రెండువందలమంది పిల్లలకు ఒక అధ్యాపకుడు ఉంటున్నాడు. మన స్థానిక హైస్కూల్‌లో సెకండరీ పరీక్షా ఫలితం కేవలం 4 శాతం మాత్రమే ఉండడం ఎంత హాస్యాస్పదం. పదేళ్ళ పాటు దాదాపు మూడుమైళ్ళ చొప్పున నడిచివస్తున్న పిల్లలు చివరికి తప్పుతున్నారు.




**రోజాలిండ్:** కాని మీరు ప్రతి గ్రామంలో ఒక డేవిడ్ హార్స్‌బరోను ఊహించలేరు కదా? మీరు రూపొందించిన వ్యవస్థను అమలు పరచాలంటే చాలా అసాధారణమైన, అర్హులైన వారి అవసరం ఏర్పడుతుంది కదా?

**డేవిడ్:** ఈ బడితోపాటు మేం పిల్లల కోసం ఇంకో నాలుగు బడులను నడుపుతున్నాం. అక్కడ నేను ఒక చిన్న అధ్యాపక శిక్షణా విద్యా లయం నడుపుతున్నాను. నిబద్ధత కలిగిన యువకులు స్కూలును స్థాపించాలని ఉత్సాహ పడుతుంటే బి.ఏ., లేదా ఎం.ఏ. (కనీసం బి.ఏ. ఉండాలనుకుంటాను) చేసిన తరువాత వారికి రెండేళ్ళ శిక్షణ నిస్తాను. కనీసం 10వ తరగతి వరకు అన్ని విషయాలను బోధించే స్థాయికి వారు చేరుకోవాలని దీని ఉద్దేశం. తరువాత వాళ్ళు తమ స్వంత బడులను ప్రారంభిస్తారు. ప్రస్థుతం అలా నాలుగు బడులు నడుస్తున్నాయి. అన్నీ గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ప్రతి దాంట్లో 15 నుండి 20 వరకు పిల్లలు న్నారు. ఈవిధంగా సుశిక్షితులైన వారిద్వారా నడపబడే బడులు బాగా పని చేస్తున్నాయి. అందువల్లనే ఈ విద్య అంతా నేర్చుకొని, నేర్పించబడే ప్రక్రియని నాకనిపిస్తుంది.




**రోజాలిండ్:** నిజమే! మొబైల్–క్రెచ్‌ద్వారా రూపొందించిన కార్యక్రమాలను చూసిన అనుభవం నాకుంది. అక్కడ చాలా తక్కువగా చదివిన వారిని ఎంపిక చేసి చక్కటి శిక్షణ ఇస్తారు. ఈ మొత్తం పనిలోను, పర్యవేక్షణలోనూ వారు చాలా శ్రమ పడవలసి వస్తుంది.

**డేవిడ్:** తమ పనికి సంబంధించి సిద్ధాంత మూలాల గురించి తెలియని అశిక్షితులను తీసుకోవడంవల్ల ఇలా జరుగుతోంది. అందుచేతనే వారిపై సదా పర్యవేక్షణ అవసరమౌతోంది. వారు కేవలం టెక్నిక్ మాత్రమే నేర్చుకున్న తర్వాత మళ్ళీ అది ఉపకరిస్తుందా? లేదా? అని వాటిలో తేడాను గమనించే ప్రయత్నం చేయకుండా ఆ టెక్నిక్‌నే ఉపయోగిస్తూ ఉంటారు. వారు దాని మూలాన్ని కూడా గ్రహించలేకపోతున్నారు. కేవలం టెక్నిక్ వరకే పరిమితమై చిక్కుల్లో పడిపోతారు. దీనిక్కారణం వారికి కేవలం టెక్నిక్ మాత్రం లభ్యం కావడం, ముందు చూపులేకపోవడం.

**రోజాలిండ్:** ఈవిధమైన శిక్షణ నివ్వడానికి విశేషమైన, అద్భుత ప్రతిభా సంపన్నులైన వారి అవసరం ఉంటుందని మీరు భావిస్తున్నారా?

**డేవిడ్:** తప్పకుండా భావిస్తాను. అందుకే కనీస విద్యార్హతగా బి.ఏ. (అలాగని బి.ఏ. చేసిన వాళ్ళను విద్యావంతులనీ అనలేం) ఉంచాం. ఎలా బోధించాలో

తెలుసుకునేందుకు అనువైన వాతా వరణం అప్పుడే మేం కల్పించగలం. ఏవిధంగా బోధించాలి? అనేది బోధించడమే మా లక్ష్యం. అందుకే స్వయంగా బోధించడానికి వారికందు బాటులో ఒక స్కూలు ఉండితీరాలి.



స్కూలు లేకుండా టీచర్ - ట్రైనింగ్ అంటే హాస్యాస్పదమేకాక అవహేళన కూడా. కుమ్మరి ఉపయోగించే చక్రం లేకుండా మట్టిపాత్రలను తయారు చేయడం నేర్పించే ప్రయత్నం లాంటిది ఇది. కాని మన దేశంలో అన్ని టీచర్ - ట్రైనింగ్ కాలేజీలు స్కూళ్ళు లేకుండానే నడుస్తున్నాయి. ఇటువంటి శిక్షణా సంస్థల విజయంపై ఎల్లప్పుడు అనుమానపు నీడలు వ్యాపిస్తూ ఉంటాయి. ఒకవేళ మీరు అధ్యాపకులకు శిక్షణనిస్తూ ఉన్నట్లయితే అందుకోసం మీకు తప్పనిసరిగా పిల్లల అవసరం కూడా ఉంటుంది. ఈ స్కూలులో టీచర్ - ట్రైనీలు దాదాపు 800 గంటల బోధనానుభవాన్ని గడిస్తారు. ఈవిధంగా జరిగినప్పుడే ఎంతో కొంత మంచి ఫలితాలు వస్తాయి. కనీసం వారు తరగతిని నియంత్రించగలిగి, పిల్లల్లో అభిరుచిని పెంపొందించగలరు. ఇదేకాక వారు కార్యశాలలకు వెళతారు. చదువుకోవడానికి వారికొక అద్భుతమైన గ్రంథాలయం ఉంది. ఇక్కడి కార్యశాల కూడా చాలా మహత్వ పూర్వమైనది. అధికశాతం భారతీయ యువ తకు హస్తకళా నైపుణ్యంగల పనులకు సంబంధించిన అభ్యాసం లేకపోవడంతో వారికి వడ్రంగానికి సంబంధించి కొయ్యను ఎలా కోయాలి? ఎలా అతికించాలి? అనే కనీస పరిజ్ఞానం కూడా ఉండదు. అన్నిరకాల పనుల్లోనూ ఇదే తంతు. చాలామంది అమ్మాయిలకైతే పనిముట్లు ఉపయోగించే అనుభవం కూడా లేదు. వారు బొమ్మలు బాగా వేయగలరు. అలాగే చాలా బాగా చదువుతారు కూడా. కావాల్సినంత సైద్ధాంతిక జ్ఞానాన్ని (సమాచారం) వారు సొంతం చేసుకొని ఉంటారు కనుక నేను ప్రతివారం వారికి దానికి సంబంధించిన నాలుగు పనులు అప్పగిస్తాను. వారంలో రెండుసార్లు సెమినార్లు ఉంటాయి. అందులో మేము విద్యా తత్వశాస్త్రం గురించి చర్చిస్తాం లేక చదువుతున్నపుడు వారి కెదురయ్యే ఇబ్బందుల గురించి చర్చిస్తాం. సామాన్య మనోవిజ్ఞానం, విద్యా మనోవిజ్ఞానం, విద్యాతత్వశాస్త్రం కూడా వారి పాఠ్య



క్రమంలో భాగమే.

**రోజాలింద్:** సమస్యను మీరు విద్యా ప్రణాళికలు రూపొందించే విద్యావేత్త దృష్టిలో చూడడంలేదని నాకనిపిస్తుంది. ఎందుకంటే వారు సమాజానికి ఏది అవసరం? అనే విశ్లేషణతో ప్రారంభించి ఆ తర్వాతే ఆయా అవసరాల కనుగుణంగా విద్యా యంత్రాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తారు. ఉదాహరణకు దేశానికి ఎక్కువ క్లర్కులు అవసరమనుకుంటే వారు ఎక్కువమంది క్లర్కులను తయారుచేస్తారు. ఒకవేళ ఇంజనీర్లు అవసరమైతే ఇంజనీర్లను తయారుచేస్తారు. ఈవిధంగా ప్రక్రియ కొనసాగుతూ ఉంటుంది.

**దేవిడ్:** నిజమే. మనదగ్గర విద్యకు సంబంధించి వ్యూహాలు రూపొందించే వారి కొరత ఏమాత్రం లేదు. భారతదేశంలో ఎన్నో ఏళ్ళ నుండి విద్యావంతులైన వారు క్లర్కులుగా తయారవుతున్నారు. నేటికీ విద్యా వేత్తలు ఇటువంటి వారినే తయారుచేయడం విచారించదగ్గ విషయం. మీకు ఎక్కువమంది శాస్త్రవేత్తలు కావలసివస్తే ఎక్కువ డబ్బు ఇచ్చి చూడండి. ఎంతమంది శాస్త్రవేత్తలు కావాలనుకుంటున్నారో తెలుస్తుంది.



**రోజాలింద్:** సార్వజనిక విద్య అంటే ప్రజలను మోసం చేయడం లాంటిది కాదా?

**దేవిడ్:** ఈనాడు మనం 95 శాతం జనాభాను ఈవిధంగానే మోసపుచ్చు తున్నాం. 5 శాతం ఉన్న ఉన్నత, సంపన్న వర్గాన్ని దృష్టిలో ఉంచుకొని వారి పిల్లలకు చాలా ప్రయోజనం చేకూర్చేందుకు మనం పాఠ్యక్రమాన్ని రూపొందించడమే దీనికి ప్రబల నిదర్శనం. విశ్వ విద్యాలయ స్థాయిని చేరుకునే అతి తక్కువమందిని దృష్టిలో ఉంచుకుని మొత్తం విద్యా ప్రణాళిక తయారవుతోంది. ప్రాథమిక విజ్ఞాన శాస్త్రం పుస్తకం చూస్తే ఇది తెలుస్తుంది. సగటు గ్రామీణ అధ్యా పకుడు దాన్ని చదవాలంటే చాలా కష్టపడాల్సి వస్తుంది. గ్రామీణ విద్యార్థులది కూడా ఇదే పరిస్థితి. అందుకే వారు మధ్యలోనే చదువు మానేస్తారు. ఇదే వ్యవస్థలో వారు ఎల్లప్పుడూ మనతోపాటు కలసి రావడం మనకు ఇష్టం లేక పోవడంవల్ల ఇది మనకీ సౌకర్యంగానే ఉంటుంది.

**రోజాలింద్:** చదువును మధ్యలోనే వదిలేసేవారు అలా చేయకుండా

ఉండడానికిగల సార్వజనిక విద్యను ఏవిధంగా మీరు ఊహించగలరు? మీరు మీ స్కూలునే తీసుకోండి. దీన్ని విశేష ప్రతిభా సంపన్నులైన వారు నడుపు తున్నారు. ఎంతో పెద్ద ఎత్తున ఆవశ్యకత కలిగివున్న ఈ ప్రణాళిక ఆచరణలో సాధ్యం కాదనిపించదా?

**డేవిడ్:** లేదు. మా బడి ఆచరణాత్మకమైనది. ఈ మధ్యనే నేను నా మిత్రుని పత్రికకు ఒక వ్యాసం రాశాను. విద్యా విధానం రూపొందించే వాళ్ళు ఈ సమస్యలను గురించి సరిగ్గా ఊహించనంతవరకు ఏమీ చేయలేమని నేను అందులో చాలా స్పష్టంగా పేర్కొన్నాను. ఒక రకంగా అక్కడ ద్వంద్వాలోచన ఉన్నట్లు మన కనిపిస్తుంది. ఉన్నతమైన హోదాలలో ఉన్న వారు చాలా పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని భావిస్తుంటారు. కాని వాస్తవానికి అలాంటిదేమీ జరగడం లేదు. పాఠ్యక్రమం చాలా బాగుంది కానీ దాన్ని ఆచరణలో పెట్టడం లేదని వాళ్ళు భావిస్తుంటారు.



మా స్థానిక కళాశాలకు మీరు వచ్చి నట్లయితే అక్కడ కొంతమంది విద్యార్థులు ఆప్షనల్ విషయంగా ఇంగ్లీష్‌ను తీసుకున్న విషయాన్ని గమనించగలరు. 'రిచర్డ్ థర్డ్' లేదా 'టెయిల్ ఆఫ్ టు సిటీస్' లాంటి పుస్తకాలను వారి పాఠ్యక్రమంలో ఉంటాయి. అయితే ఏ విద్యార్థి ఈ పుస్తకాలను చదవడు. చదవడం అటుంచి వాటిని కొనడు కూడా. వాళ్ళు ఆ పుస్తకాలకు సంబంధించి కొన్ని వ్యాసాలు జ్ఞాపకం ఉంచుకొని వాటినే పరీక్షలో రాస్తారు. పాఠ్యక్రమాన్ని రూపొందించే వాళ్ళు, పరీక్షలు నిర్వహించే వాళ్ళు, బోధించేవాళ్ళు అందరూ విద్యార్థులు సాహిత్యం చదువుతున్నందుకు ఆనందిస్తూ ఉంటారు. కాని వాస్తవానికి ఇలాంటి దేమీ జరగడంలేదు. (నవ్వుతూ)

**రోజాలిండ్:** విద్యావిధానాన్ని రూపొందించే వాళ్ళు ఏం చేయాలని మీరు భావిస్తున్నారు?

**డేవిడ్:** సాధారణంగా పరిచయం ఉన్న ఎన్నో విషయాల గురించి మనం తెలుసుకోవాల్సి ఉంది. ఉదాహరణకు ఎంతో మంది 10వ తరగతి పరీక్షలో



తప్పుతున్నారు. ఈ పరిస్థితి నుండి బయట పడడానికి ఒక పద్ధతి ఉంది. విభిన్న స్థాయిల్లో, స్వేచ్ఛగా కావలసిన విషయాలు స్వీకరించడానికి విద్యార్థికి స్వతంత్రత ఉండాలి. వాళ్ళ ఇష్టప్రకారం ప్రాథమిక గణితమయినా, అడ్వాన్స్‌డ్ గణితమైనా తీసుకోవచ్చు. ఈ విషయాలలో గ్రేడ్లు ఇవ్వవచ్చు. అంతేగాక ఎవరైనా విద్యార్థి బడి చదువు పూర్తిచేసిన తరువాత 3 లేదా 5 లేదా 2 విషయాలను తీసుకోవచ్చు. అంటే ఒకవేళ ఎవరైనా విద్యార్థి విశ్వవిద్యాలయ స్థాయిలో భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం లాంటి విషయాలు చదవదల్చుకుంటే సెకండరీ స్థాయిలో వారు అడ్వాన్స్‌డ్ గణితం, భౌతిక, రసాయన విషయాలను తీసుకోవచ్చు. ఒకవేళ ఎవరైనా విద్యార్థికి ఇటువంటి కోరిక లేనట్లయితే, అతను ప్రతిభాశాలి కూడా కానట్లయితే అతను ప్రాథమిక ఆంగ్లం, ప్రాథమిక తెలుగు, ప్రాథమిక గణితం, అలాగే ప్రాథమిక పర్యావరణ విజ్ఞానం లాంటి విషయాలను ఎంపిక చేసుకోవచ్చు. అటువంటి స్థితిలో అతనికి 4 'సి' గ్రేడ్లు లభిస్తాయి.



ఒకవేళ ప్రభుత్వానికి చపరాసీ (గుమాస్తాలు)లు అవసరమైతే దాని క్కావల్సిన అర్హత 4 'సి' గ్రేడు అవుతుంది. ఏదైనా పనికి 4 'బి' గ్రేడు, యూనివర్సిటీలో పనికైతే మూడు, ఐదు, పది ఏ గ్రేడ్లు గల వాళ్ళు అవసరమవు తారు. అంటే అందరూ ఉత్తీర్ణులవుతారు కాని వేరే – వేరే స్థాయిల్లో. ఇటువంటి పరిస్థితిలో ఎవరినైనా భర్తీచేసే సమయంలో 'నువ్వు 10వ తరగతి పాస్ అయ్యావా?' అని మీరు అడగరాదు. మీరతన్ని నీవు ఏ గ్రేడులో పాస్ అయ్యావని మాత్రమే అడుగుతారు. ఉద్యోగార్థి నేను చదవగలను, రాయగలను, తెలుగు, గణితాలలో నాకు 'బి' గ్రేడ్లు వచ్చాయని అంటాడు. అప్పుడు 'చాలా మంచిది. మా సంస్థలో ఒక క్లర్క్‌గా పనిచేయవచ్చు" అని మీనుండి జవాబు వస్తుంది. 4వ శ్రేణి కర్మచారి (అటెండర్) కోసం ప్రభుత్వం త్వరలోనే ప్రకటన ఇస్తుంది. దాని ప్రకారం 10వ తరగతి ఉత్తీర్ణుడై చదవడం, రాయడం వచ్చినవాడు వారికి అవసరం. ఇపుడు మీకు చదివే అర్హత ఉన్నవారు లభ్యం అవుతారు. కాని వాళ్ళకి విజ్ఞాన శాస్త్రం తెలిసి ఉండాలని కోరకండి.

నా మనుమరాలు హేస్టింగ్స్ కాలేజీకి వెళ్ళాలనుకుంటోంది. ఇక్కడ చేర



కోలేరు. ఇదే పరిస్థితి సమాచార పత్రి కలది కూడా. ఒకవేళ నేను తెలుగులో ఒక వార్త చదివి విన్పిస్తే మా వంటావిడ ఒక మాట కూడా అర్థం చేసుకోలేదు.

**రోజాలిండ్:** మీ పిల్లలు తమ చుట్టు పక్కల పరిసరాలను అర్థం చేసు కోవడంలో చాలా జాగరూకత కలిగి ఉంటారని మీకని పిస్తుందా? అలాగే వారు దీనిలో పరివర్తన తీసుకురావడంలో తమ పాత్ర గురించి ఆలోచించగలుగుతారా?

**దేవిడ్:** నిస్సందేహంగా. ఎందుకంటే వారు దోపిడీ వ్యవస్థ గురించి చాలా ఎక్కువగా తెలుసుకుంటున్నారు. దీనిని ఒక ఉదాహరణ ద్వారా అర్థం చేసు కోవచ్చు. ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం కొంత అప్పు ఇస్తుంది. కాని అప్పులో దాదాపు 20 శాతం అప్పు ఇప్పించే వారికి ఇవ్వాల్సి వస్తుంది. 1000 రూపా యల రుణంలో 200 రూపాయలు చూస్తుండగానే చేతులు మారతాయి. ఇటు వంటి విషయాలు ఎంత సాధారణమయ్యాయో అందరికీ తెలుసు. కాని పిల్లలు ఇటువంటి విషయాలపై అప్రమత్తమవుతున్నారు. పాతతరం గ్రామీణులు ఏదైనా విషయాన్ని అర్థం చేసుకోవడంతో మతం ప్రభావం తీవ్రంగా ఉండేది. కాని కొత్తతరం ఈ ప్రభావం నుండి బయటపడుతోంది.

**రోజాలిండ్:** ఇటువంటి విషయాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మధ్య ఏవైనా ఇబ్బందులు ఉత్పన్నమవుతున్నాయా?

**దేవిడ్:** అవి కూడా ఎదురయ్యేవే. పిల్లవాణ్ణి విద్యావంతునిగా తీర్చిదిద్దడం మొదలుపెట్టడంతో అతను తన గ్రామమే పూర్తి ప్రపంచం అనుకునే తన సమాజానికి, తల్లి - దండ్రులకు దూరం అవుతూ ఉంటాడు. విద్యార్థి ప్రపంచం గడచిన కాలలో హరప్పా, మహంజొదారో అయితే, అదే వర్తమాన కాలంలో అమెరికా, గ్రీన్‌ల్యాండ్, మొత్తం ప్రపంచమంతా విస్తృత మవుతూ ఉంటుంది. వాని ప్రపంచం తన తల్లిదండ్రుల ప్రపంచానికి భిన్నంగా ఉంటుంది. కాబట్టి పిల్లలు మతం, లింగ (స్త్రీ-పురుష) వివక్ష, రాజనీతితోపాటు మొత్తం అన్ని విషయాలమీద (స్కూలులో) ఏవిధంగా మాట్లాడుతూంటారో అదేవిధంగా వారు



గ్రామంలో ప్రచారంలో ఉన్న అనేక నమ్మకాలు, విశ్వాసాలు, మతాచారాలు మొదలైన వాటిపై సందేహం వ్యక్తం చేస్తుంటారు. అందువల్ల పిల్లలు, వారి తల్లిదండ్రుల మధ్య వివాదాస్పద పరిస్థితులు ఉత్పన్నమవుతాయి.

**రోజాలిండ్:** వారిలో ఎవరైనా పిల్లలను బడికి రాకుండా ఆపారా?

**దేవిడ్:** లేదు. ఇప్పటి వరకు ఎవరూ అలాచేయ లేదు. ఎంత ఎక్కువ సమయం వాళ్ళు (తల్లిదండ్రులు) పిల్లలను నాదగ్గర ఉండనిస్తారో అంతే స్థాయిలో పిల్లలు ఏదైనా చేస్తున్నపుడు వారిని ఆపడం పెద్దలకు కష్టమవుతుంది. అమ్మాయిలు వివాహాన్ని ఆలస్యం చేయడంలో విజయం సాధిస్తున్నారు. మూడేళ్ళ క్రితమే వివాహమైన 18–19 సంవత్సరాల అమ్మాయిలు ఇక్కడ కొంతమందున్నారు. కాని వీరంతా డిగ్రీ తీసుకోవాలని నిర్ణయించు కున్నారు. చాలా త్వరగా మార్పులు రావడంవల్ల వారు తమకోసం ఈ విజయాన్నైతే సొంతం చేసుకున్నారు. ఏవిధమైన మార్పు వస్తుందనే విషయాన్ని మీరు ఒక ఉదాహరణ ద్వారా అర్థం చేసుకోవచ్చు. నేను బడి ప్రారంభించిన కొత్తలో తల్లిదండ్రులు ప్రతిరోజూ తమ పిల్లలను కొడుతూ ఉండేవారు. కాని ఇప్పుడు కేవలం ఒక తండ్రి మాత్రం, అది కూడా చాలా మత్తులో ఉన్నప్పుడు పిల్లలను కొడుతూ ఉంటాడు. ఈరకమైన మార్పుకు ఇదొక్కటే ప్రమాణం. దీనికి సంబంధించిన




అభిప్రాయం ఇది సరైనదనీ, సరికానిదనీ వేరు- వేరుగా ఉండవచ్చు. కాని మార్పులు మాత్రం జరుగుతూ ఉంటాయి. సగటు 15 సంవత్సరాల పిల్ల వానికంటే కుటుంబంలో ఈ పిల్లల మాటకు ఎక్కువ ప్రాధా న్యత ఉంటుంది. తల్లిదండ్రులు వీరినుండి చాలా బాధ్యతాయుతమైన, జవాబు దారితనం గల సలహా ఆశించడం మొదలు పెట్టారు. అలాగే పిల్లలు తమ తల్లిదండ్రులు పొదుపు చేయాలని, మద్యం తక్కువ తాగాలని, వారు భూమి, గ్రామ సంబంధ సమస్య లపై దృష్టిసారించడం లాంటివి చేయాలని ప్రయ త్నిస్తూ ఉంటారు.

**రోజాలిండ్:** భౌతికంగా లాభం లేనంత వరకు విద్యార్థులు బడికెళ్లడానికి కూడా ఇష్ట పడరని అంటుంటారు. మీస్కూలు పిల్లల అనుభవంలో ఇది సరైనదని పిస్తుందా?

**దేవిడ్:** దీన్ని నేను అంగీకరిస్తున్నాను. ఎందుకంటే తమ పిల్లలను మేకలు

మేపడానికి పంపేందుకు ఇష్టపడే తల్లిదండ్రులకు నచ్చజెప్పటానికి మీపిల్లవాడు స్కూలుకు పోతే అతనికి మంచి ఉద్యోగం దొరుకుతుంది, అప్పుడు మీకు ఇంత కష్టపడవలసిన అవసరం ఉండదనే ప్రలోభం చూపించాల్సివస్తుంది. ఈరకమైన కొన్ని ప్రలోభాలు నేను కూడా ఇవ్వాల్సి వచ్చింది. దీన్ని నేను అంగీకరిస్తున్నాను. స్వయంగా నిరక్షరాస్యులు కావటంవల్ల కేవలం విద్య మాత్రమే మెరుగైన జీవన స్థాయిని అందించే మాధ్యమమని వారికి అనిపిస్తుందని నా అభిప్రాయం.



**రోజాలిండ్:** కాని వాళ్ళకు ఒక మెరుగైన జీవితం సాధ్యమేననిపిస్తుందా? పిల్లలు ఈ విధంగా ఆలోచించడం మొదలు పెట్టారా?

**దేవిడ్:** పిల్లలకు ఇది సాధ్యమేననిపిస్తుంది. మీ ప్రశ్న తల్లిదండ్రులకు సంబంధించిందని నా అభిప్రాయం. ఈవిషయం వారి మొత్తం వ్యవహారాలను ప్రతిబింబిస్తుంటుంది. కళకు సంబంధించి ఏ రూపాన్ని తీసుకున్నా దాని గురించి, షేక్స్పియర్ గురించి లేదా కొయ్య, లేదా మట్టికి సంబంధించిన పని, నాటకం లేదా విభిన్నవిషయాలపై చర్చించడం, భౌతికమైన కొత్త-కొత్త అనుభవాలు గడించటం మొదలైన వాటిగురించి తల్లిదండ్రులు విని ఉండరు. ఇవన్నీ వారిని చాలా తీవ్రంగా ప్రభావితం చేస్తాయని నాకనిపిస్తుంది.

**రోజాలిండ్:** ప్రారంభం నుండే భాషలను నేర్చుకోవడం, తెలుసుకోవడం లాంటివి మీరు సమర్థిస్తున్నారా?

**దేవిడ్:** అవును. నాదృష్టిలో చర్చ విద్యయొక్క మహత్వపూర్వమైన అంగం. ఒక పిల్లవానికి చదువు నేర్పించినప్పుడే విషయాలను కూడా ఎలా అర్థం చేసుకోవాలో నేర్పించగలిగితే మీపని పూర్తయినట్లే. ఇక మిగిలిన మూడవ పని- పిల్లవాడు వీలైనంత ఎక్కువగా తెలుసుకోవడానికై వాడిని ఉత్సాహపరుస్తూ ఉండాలి. ఎవరైనా ఈడొచ్చిన పిల్లవాడు ఒకవేళ చదవడం తెలిసి, ఇంకా ఎంతో ఎక్కువగా చదవాలనే పట్టుదల వానిలో ఉన్నట్ల యితే వాడు ఏదికావాలంటే అది నేర్చుకో గలుగుతాడు. అసలు రహస్యం ఇదే.

**రోజాలిండ్:** అందుకే వాళ్ళకు మీరు ఇంగ్లీష్ నేర్పిస్తున్నారా?



**దేవిడ్:** కొంతమేరకు అవును. ఎక్కువగా మాతృభాషా మాధ్యమం గల స్కూళ్ళు ఇంగ్లీ ష్ను బోధిస్తున్నాయి. కాని పిల్లలు విశేషంగా ఏమీ నేర్చుకోలేకపోతున్నారు. కారణం ఇంగ్లీష్కు వారంలో కేవలం ఒకే క్లాసు ఉంటుంది. ఇంగ్లీష్లో భూగోళం, చరిత్ర, జీవజ్ఞానం, ఎలక్ట్రానిక్స్ లేక ఏ విషయానికి సంబంధించినవైనా సరే వందలకొద్దీ పుస్తకాలు దొరుకుతాయి. కాని కన్నడ, తెలుగు భాషల్లో అవి దొరకవు. అందువల్లే ఏ పిల్లవాడైతే సులభంగా ఇంగ్లీష్ చదవలేడో అతను ఉన్నతమైన, గొప్పవిద్యను పొందలేడని నేను అనుకుంటున్నాను. అందుకే పిల్లలు ఇంగ్లీష్ తప్పక నేర్చుకోవాలని నాకు అనిపించింది.



ఇంకోవైపు ఇంగ్లీష్ మాధ్యమం గల స్కూళ్ళలో ఏ భారతీయ భాషలోనూ పిల్లల సామర్థ్యం వికాసం చెందదు. కాబట్టి ఈ పిల్లలు భారతీయ సంస్కృతియొక్క ప్రధాన స్రవంతి నుండి వేరవుతున్నారు. అంతేగాక హాస్యాస్పదమైన సంస్కృతి (ఎనిడ్ బ్లైటన్ నవలలు, పాప్ సంగీతం మొదలైన వాటి ఇమేజ్)లో జారుతూపోవడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు.

భిన్న సంస్కృతులు ఇచ్చిపుచ్చుకొనే విధానంలో భాష ఒక ప్రముఖమైన భూమికను పోషిస్తుంది. ఏదైనా భారతీయ భాషను నేర్చుకోనంతవరకు భారతీయ సంస్కృతిని విద్యార్థి అర్థం చేసుకోలేడు.



**రోజాలిండ్:** మీ ఇంగ్లీష్ పుస్తకాలు మీకు ఒక రకమైన మూసలాగా కని పించవా?

**దేవిడ్:** వీటికి సంబంధించినంత వరకు మార్కెట్ను దృష్టిలో ఉంచుకోవాలి. లేనట్ల యితే ప్రకాశకులు దాన్ని మార్కెట్ నుండి బయటకు తీసివేస్తారు. నా పుస్తకాలు కూడా ఒక రకమైన ఒప్పందానికి సంబంధించినవే. మీరు ఏవిధంగా రాయాలనుకుంటున్నారో అటువంటి పుస్తకాలు రాయలేరు. ఎందుకంటే

ఇటువంటి స్థితిలో ఎవ్వరూ వాటిని కొనరు. ఒకసారి నేను నా ఇష్టాను సారం విజ్ఞానశాస్త్ర పుస్తకాలను రాశాను. కాని వాటికి మార్కెట్‌లో డిమాండ్ లేదు. దీని క్కారణం ఆ పుస్తకాలు విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన సాధారణ పుస్తకాలకు చాలా భిన్నమైనవని నాకనిపిస్తుంది.

**రోజాలిండ్:** ఎలా?

**డేవిడ్:** ఎలాగంటే వాటిలో ఎన్నో ప్రశ్నలు అలాగే వదిలివేశాను. సామాన్య విజ్ఞాన పుస్తకాలలో ఒక వైపుకప్ప బొమ్మ ఉండి రెండవ వైపు కప్పకు నాలుగు కాళ్ళు, ఒకనాలుక ఉండి అది కీటకాలు, మిడుతలు మొదలైన వాటిని తింటుం దని వివరణ ఉంటుంది. అలాగే పేజీకి వెనుక వైపు ఒక కప్పకు ఎన్ని కాళ్ళుం టాయి? లాంటి ప్రశ్నలు ఉంటాయి. ఇటువంటి స్థితిలో పిల్లవాడు ఖాళీ స్థానాన్ని పూర్తిచేసి ఏదో ఘనకార్యం చేసినట్లు సంబరపడుతూ ఉంటాడు. ఆ తర్వాత వాడు తరువాత పేజీలకు వెళతాడు. కాని నాపుస్తకాలు వీటికి భిన్నంగా ఉంటాయి. వాటిలో పిల్లలు విషయాలు వెదికి వాటిని పరి శీలిస్తారు, తాను చూసినదంతా రాస్తారు. విజ్ఞాన శాస్త్రానికి సంబంధించి ఎన్నో అంశాలు ఉండి వాటిలో సరైన సమాధానాలు చాలా గొప్ప విషయంగా భావిస్తున్నారు. ఈ విధంగా నాపుస్తకాలు కొంచెం వేరుగా ఉంటాయి. వాటిలో ప్రశ్నలు ఓపెన్‌గా వదిలి వేయబడి, కరెక్టు సమాధానాలకంటే బహిరంగ చర్చను ప్రోత్సహించడానికే అధిక ప్రాముఖ్యత ఉంటుంది.



**రోజాలిండ్:** కాని ఈ విధంగా మాట్లాడడానికి, చర్చించడానికి చాలా తెలివైన పిల్లల అవసరముంటుంది కదూ?

**డేవిడ్:** పిల్లలు చాలా తెలివైనవాళ్ళు. వీటి గురించి మీరు పిల్లలతో మాట్లాడ వచ్చు.

**రోజాలిండ్:** అటువంటప్పుడు ఈ సందర్భంలో అధ్యాపకులు చాలా సంవే దనాశీలురుగా ఉండాల్సి వస్తుందా?

**డేవిడ్:** తప్పనిసరిగా. అధ్యాపకుడు తప్పనిసరిగా సంవేదనాశీలుడై ఉండి



తీరాలి. నా అభిప్రాయంలో భాగంగా అధ్యాపకుడు కూడా విద్యావంతుడై ఉండాలని చెప్పాను. వారు విద్యావంతులు కాదు కాబట్టే విద్య సరిగ్గా కొన సాగడంలేదు.



**రోజాలిండ్:** ప్రజలు యంత్రాలు మొద లైన ఇతర వస్తువులవైపు ఆకర్షితులు కావడా నికి ఇదే కారణం అంటారా?


**డేవిడ్:** చాలా ఆసక్తికరమైన విషయం. కాని ప్రశ్న కేవలం అధ్యాపకులదే కాక ముఖ్యంగా విద్యార్థులకు సంబంధించింది. ప్రస్తుతం భారతదేశంలో దాదాపు 10కోట్లమంది విద్యార్థులున్నారు.

**రోజాలిండ్:** రేడియో గురించి మీ అభిప్రాయం ఏమిటి?

**డేవిడ్:** ఈ బడులలో కాని లేక పిల్లల దగ్గరకాని రేడియో లేదు. ఒకసారి నేను దేశం లోనే బాగా పేరున్న ఒక పెద్ద సంస్థలో టీ.వీ. ప్రాముఖ్యత పై ఏర్పాటుచేసిన సెమినార్‌లో పాల్గొన్నాను. 'మనకు ఢిల్లీ స్టేషన్ మాత్రమే అందు బాటులో ఉన్నపుడు టీ.వి. విద్యకు సంబంధించి ఏ రకంగా సహాయక పాత్ర నిర్వ హించగలదని' నేను తీవ్రమైన వ్యాఖ్యలు చేశాను. ఒకవేళ మనం ప్రతిదినం ఒక్కో తరగతికి ఒక గంట టీ.వి. ఉంచినట్లయితే రోజుకు కనీసం 10 గంటలు కేటాయించవలసి వస్తుంది. అటువంటప్పుడు పిల్లలేంచేస్తారు? మీరు టీ.విలో ఆర్కిటిక్, అంటార్కిటిక్ ధృవాలు చూపించడం వరకూ బాగానే ఉంది. అలాగే దీన్ని మీరు గొప్పవిషయంగా కూడా భావించ వచ్చు, కాని మీరు వాటిద్వారా ఏమీ నేర్చుకో లేరు. ఎందుకంటే ఇదంతా కూడా పూర్తిగా ఏక పక్షంగా ఉంటే నేర్చుకోవడం రెండవ పక్షం (ఇందులో విద్యార్థికి కూడా భాగస్వామ్యముం టుంది). టీ.వి ఏక పక్షంగల మాధ్యమం. అలాగే అందులో భాగస్వామ్యముంటుంది. ఇందులో ఇదే ప్రమాదం. ఏదో కొంచెం నేర్చు కుంటున్నట్లు మీకనిపించినా వాస్తవానికి మీరు ఏమీ నేర్చుకోవడం లేదు.



**రోజాలిండ్:** డేవిడ్! పర్యావరణానికి సంబంధించి మీ సిద్ధాంతాలు కూడా ఇతరుల



భావన కంటే ఎంతో వ్యాపకమైనదని నాకని పిస్తుంది. పర్యావరణ అధ్యయనం మీద మీరు పుస్తకాలు రాశారా?

**డేవిడ్:** పర్యావరణానికి సంబంధించి పిల్లల కోసం కూడా నేను కొన్ని పుస్తకాలు రాశాను. కాని వాటికి కూడా మార్కెట్లో డిమాండు లేదు. ఎందుకంటే వాటిలో పిల్లల ద్వారా పర్యావరణ అధ్యయనం తప్పనిసరి. కాని పిల్లలు పర్యావరణ అధ్యయనం చేయడం అధ్యాపకులు ఇష్టపడరు. మొత్తం మీద విద్యార్థులు పూర్తి ఏకాగ్రతతో పుస్తకాలు గుర్తుపెట్టుకోవడమే అధ్యాపకులకు కావలసింది. ఇంకా చెప్పాలంటే చాలామంచి అధ్యాపకులుగా భావింపబడే వారు కూడా పాఠ్య పుస్తకాన్ని ఖూనీచేస్తూ ఉంటారు. రెండేళ్ళ క్రితం నేను ఢిల్లీ వచ్చినపుడు నామిత్రు డొకాయన తన మిత్రురాలు ఒకరు స్కూలులో బోధిస్తోందని అక్కడ నా పుస్తకాలే ఉన్నాయని ఆమె నన్ను కలవాలనుకుంటోందని నాతో చెప్పాడు. నేను వారిని తీసుకురమ్మనాను. బడిలో ముందు ఏం చేస్తున్నారో చెప్పండి అని ఆమెను అడిగాను.

నా పుస్తకంలో చెట్లగురించి ఒక అధ్యాయం ఉంది. అందులో స్కూలు దారిలో మీరు ఎన్నిరకాల చెట్లుచూస్తున్నారు? అనే ప్రశ్న ఉంది. వాటిలో మీకు ఏదైనా చెట్టుపేరు తెలుసా? వాటిపై మీకు ఆకులేమైనా కన్పిస్తు న్నాయా? మీరు ఆ ఆకుల చిత్రాలను మీ కాపీ పుస్తకంలో వేసిచూడండి. అప్పుడామె ఈవిధంగా జవాబిచ్చింది. నేను పుస్తకం తీసుకొని 'చెట్టు' అని చదువుతాను. మీరు ఎన్ని రకాల చెట్లు చూస్తుంటారు? దీని తర్వాత నేను బ్లాక్‌బోర్డు మీద చెట్ల పేర్లను రాస్తాను. అలాగే పిల్లవాడిని తమ కాపీ పుస్తకాల్లోకి ఎక్కించుకుంటారు. ఆ మరునాడు నేను వారిని మీరు ఏఏ చెట్లు చూశారు? అని అడుగుతాను. ఢిల్లీలోని ఒక ప్రతిష్ఠాత్మక స్కూలుది ఈపరిస్థితి అని చెబితే నమ్మకం కలగదు. ఇకవేరే స్కూళ్ళ గురించి మీరే ఊహించవచ్చు. పరిసరాల విజ్ఞానం చాలా అవసరం. కాని నగరాలలో ఎవరూ దీనిని అధ్యయనం చేయడం లేదు. రిక్షాలో వెళుతూ





మీరు ఏ ఏ దుకాణాలు చూశారు అని ఎవరినైనా అడిగితే బహుశా వారు జవాబు చెప్పలేరు. నగర వాతావరణం గురించి గానీ, ఏదైనా విషయం గురించిగానీ లేదా గ్రామీణ వాతావరణం గురించి గానీ వారికేమీ తెలియదు.

**రోజాలిండ్:** మొత్తంమీద పరిస్థితులు చాలా భయావహంగా కనిపిస్తున్నాయి. మార్పు గురించి మీరు ఏం ఊహిస్తున్నారు?

**డేవిడ్:** దీనికి సమాధానమేంటో నాకు తెలియదు. నేను కేవలం నా చిన్న గ్రామంలో కూర్చొని మంచి విద్యగా భావించే దానికోసం ప్రయత్నం చేస్తూ ఉంటాను.

